# శ్రీ వేంకటేశ్వర
# సుప్రభాత శతక మాల

(ఆంధ్ర పద్యకృతి)

49698



కృతికర్త

**తేజోమూర్తుల వేంకటేశ్వరరావు**

ఎం. ఏ, బి ఇడి,

ప్రథమశ్రేణి ఆంధ్ర పండితులు

జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల

మంగవరం

PLACED ON THE SHELF
Date..........

హక్కులు :
గ్రంథకర్తవి

శ్రీముఖ - వైశాఖము (1993)

ప్రతులు - వేయి.

మూల్యము : రూ॥ 12-00


THIS BOOK IS PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE Rs. 5100/- OF TIRUMALA TIRUPATI DEVASTHANAMS UNDER THEIR SCHEME AID TO PUBLISH RELIGIOUS BOOKS

ముద్రణ :
రాధాకృష్ణ ప్రింటర్సు తుని.
నక్కనవీధి, ఫోన్ 446

ప్రతులకు :-
శ్రీమతి తేజోమూర్తుల ఆనందకుమారి
W/o తేజోమూర్తుల వేంకటేశ్వరరావు
ఇ నెం 1-27
పాయకరావు
విశాఖజిల్లా

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE.
Acc. No. 49698
Date..........
TIRUPATI.

కృతిభర్త



శ్రీ వేంకటేశ్వరస్వామి
తిరుమల తిరుపతి



కృతికర్త జననీ జనకులు

తండ్రి : తేజోమూర్తుల రామగోవిందము గారు

తల్లి : లక్ష్మినరసమ్మ గారు



కృతికర్త - వారి ధర్మపత్ని

శ్రీ తేజోమూర్తుల వేంకటేశ్వరరావు
శ్రీమతి ఆనందకుమారి

# మంగళాశాసనము

శ్రీ తేజోమూర్తుల వేంకటేశ్వరరావు గారు నాకు చిరకాల మిత్రులు. వీరికి బాల్యమాదిగా కవితా వాసన గలదు శ్రీ వేంకటేశ్వర శతక సుప్రభాత పుస్తకములను చూచితిని. ఇందు మొదటిది స్వతంత్ర కావ్యము. రెండవది సంస్కృతములోని శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమునకు ఇంచుమించు అనువాదము కవులలో రెండు రకములు. స్వతంత్రముగా కావ్యనిర్మాణము చేయువారు కొందఱు సుప్రసిద్ధ సంస్కృత కావ్యములను ప్రాంతీయ భాషలలోనికి అనువదించువారు కొందఱు. ఒక్కొక్కరికి ఒక్కొక్కదానిలో నైపుణ్యముండును, కాని వీరికి యీ రెండు ప్రక్రియల యందును సమానముగా ప్రజ్ఞాపాటవములు కలవు. ఒక కవి స్వతంత్రముగా నొక కావ్యమును రచించుటకన్న నొక సుప్రసిద్ధ కావ్యమును అనువదించుట మిక్కిలి కష్టమైన పని యని నా యభిప్రాయము. పండితలోక మంతయు దీని కంగీకరించునని నానమ్మిక. కవికినొక్క భాషలో పాండిత్యమున్న చాలును కాని, యనువాదకునకు రెండు భాషలలోను సమానమైన పాండిత్యముండవలయును. శ్రీ వేంకటేశ్వరరావు గారికి యీ రెండు పద్ధతుల యందును సామర్థ్యము పుష్కలముగా నున్నది.

వీరి వేంకటేశ్వర శతకములో అన్నియు సీసపద్యములే. పద్యనిర్మాణములోని ధారశైలి సహజ సుందరములు. ఈ పద్యములలో సమాజమునకు వీరేన్నియో నీతులు గఱపినారు, ఉదహరణకు "శ్రీరంగనీతులు చప్పుట సరిగాదు, యాదర్శ మూర్తిగా నలరవలయు" మొదలగునవి యెన్నియో కలవు ఇక సుప్రభాతము గూర్చి వేఱుగా చెప్ప నవసరములేదు. ఆద్యంతము మిక్కిలి చక్కగా నున్నది. ఉత్తమ కవిత్వమునకు ప్రమాణమేమని పూర్వము కొందఱు ఒకసుప్రసిద్ధ విద్వత్కవివరేణ్యనిఆడుగగా వారిసమాధానము ఆపద్యమును ఒకసారి చదువగనే అర్థము కావలయును, రెండవసారి చదువగనే కంఠస్థలము కావలమును, ఈసమాధానము వీరి

పద్యములకు వర్తించును. భగవన్నామమే తననామముగా దాల్చి
న శ్రీ వేంకటేశ్వరరావుగారిని ఆవేంకటేశ్వరుడు కలకాలము చల్ల
గా జూచి యింతోధికముగా గ్రంథ రచన చేయు సామర్థ్యమొసంగు
గాత. శుభం భూయాత్

ఇట్లు
బుధ జన విధేయుఁడు
(సం) వంగపండు సర్వేశ్వరరావు బి. ఏ.
మండలాభివృద్ధిఅధికారి
పాయకరావుపేట
విశాఖజిల్లా

పాయకరావుపేట
తే 28-3-91

# ప రి చ య ము

శ్రీ చిరంజీవి తేజోమూర్తుల వేంకటేశ్వరరావు స్వయంకృ
షితో [కళాశాలలో చదువవలెనె] ఎం ఏ బి. ఇడి పట్టములు
గైకొన్నవాడు ఇత డనేక స్తుతులు రచియించి భగవంతునికే
సమర్పించు కొన్నట్టి ధన్యుడు భగవంతునిపై ప్రగాఢ భక్తి
విశ్వాసములున్నవాడు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వాని యిలవేల్పు ఇతడు తద్దాసుడే
ఈ గ్రంధమందు తన యనుభూతులు వెలువరించినాడు. ఈగ్రంధ
ములో కొంత యనువాదము శతక భాగము స్వీయరచన ఒక విలు
కాడొనరించిన రంధము నుండి దూరునట్లు ఇంకొకరు బాణము
వేయుట సామాన్యము గాదు. ఇది సరించు వారి కొతవంత వరకు
సాధింపగల్గెనో విదితము సీసము కూర్చుట దానితోసరిగా భావము
మల్చుట సీసమునకు తగినంత వస్తువు తీసి, కొనుట ఒకయెత్తు,
ఎత్తుగీతి ఒకయెత్తు బ్రహ్మశ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు సీసం
ము పసయెత్తుగీతికలో ఉన్నదన్నారు. ఇతడద్దా శక్తి మేరకు బాగు
గనే నిర్వహించినాడు పద్య రచనా వ్యాసంగము మున్ముందు యీతడు
కృషి చేయవలె నని అది యింకా సత్ఫలము లొసంగవలెనని

ఆ శ్రీనివాసుని దానికి తగినశక్తి నొసంగుదుమని ప్రార్థించు చున్నాను. ఆయురారోగ్యములిచ్చి యితనిని శ్రీవేంకటేశ్వర స్వామి రక్షించుగాత! శుభమస్తు!

ఇట్లు

మంగవరం | (సం) సుంకరణూర వేంకట రామ
24-4-93 | కృష్ణారావు బి. ఏ

## ఆ ము ఖ ము

బ్రహ్మశ్రీ తేజోమూర్తుల వేంకటేశ్వరరావుగారు వ్రాసిన శ్రీ వేంకటేశ్వర శతకము మరియు సుప్రభాతము ఆ మూలాగ్రముగ చదివితిని, చాల చిన్ననాటి నుండియు వీరు కవితావ్యవసాయము చేయు చున్నట్లు వారి ముద్రితా ముద్రిత గ్రంధములను చూచి తెలిసికొన్నాను. ఆస్వామి నామమే వీరి నామమూట కాక తాళీయమేమో కాని వీరు మాత్రము తనపేరును పై గ్రంధరచనలు చేసి సార్థకము చేసికొన్నారు వీరు వేంకటేశ్వర నామోచ్ఛారణతో నిత్యము తాదాత్మ్యము చెందుట నేను కళ్ళారా చూచి ఆశ్చర్యచకితుడనైనాను ఆ స్వామి వీరికి స్ఫూర్తి నిచ్చి తనకో సం చక్కటి పద్యాలతో సుప్రభాత శతకాలను రచియింపజేసి కొన్నాడని నాకు అనిపిస్తోంది.

"శ్రీకార శ్రీకర అంటూ సీసపద్యాలతో సాగిన స్వామి శతకము పండిత పామర రంజక మగుట అతిశయోక్తి కాదు, ఇంకేల? పాఠకునికి చక్కని కవితామృతంతో పాటు ఆస్వామిపై భక్తిని పెంపొందించే శక్తి వీటికున్నదని చెప్పుట సాహసము కానేరదు. అదృష్టవంతుడైన యీ కవి తన జన్మను సార్థకము చేసికొంటు న్నాడు, తథాస్తు.

(సం) కలగ రామ జోగేశ్వర శర్మ ఎం ఏ.
ప్రథమశ్రేణి ఆంధ్రపండితులు
జూనియర్ కళాశాల
పాయకరావుపేట..

పాయకరావుపేట |
29-3-91 |

శ్రీరస్తు                శుభమస్తు                అవిఘ్నమస్తు

శ్రీ వేంకటేశాయ నమః

# మనవి

శ్రీమద్వేంకటేశ్వరస్వామి విలాసమైన సాహిత్య జగత్తున నడుగిడి నిగ్రహించి నిలచుట మహాద్భాగ్యము. ఇత్తరి నా యనుభూతి విభూతుల్ని మీ ముందుంచి పంచుట నా ప్రథమ కర్తవ్యము నా యభ్యున్నతికి కారకులు, ప్రేరకులు సదా కడు సంస్మరణీయులు ఏతత్కృతులావిర్భవ వికాసపు వాస్తవ విశేషములను ప్రస్తుతము ప్రస్తావించుట సముచితమని నా యభిమతము.

నా విద్యార్థిదశలో మా గురుదేవుల బోధనా మాత్ర వాపిత కవితాబీజములు, మిత్రుని తోడ్పాటున నంకురితమై, కవితాగురువుల ప్రేరణచే ప్రవర్ధమానమై, గత వానసాకల్మి బల్మిని పుష్పించి దైవయోగమున ఫలవంతమగుట యతిశయోక్తి కాదు.

ఇందలి శ్రీవేంకటేశ్వరశతకము నా తొలి పద్యకృతి, అల్లిబిల్లి పద్యమాలల్లు వేళ పితృతుల్యులు, కవితా గురువులు శ్రీసుంకరణం వేంకట రామకృష్ణారావు గారు కాకతాళీయముగా నా పద్యకృతిం గని నా వెన్నుదట్టి పుత్రవాత్సల్యమున నాయనా నిర్దిష్ట వస్తువు నిష్ట గొని ధారనాగనీక కొనసాగనీయుమా" యని బోధపరచిన, నాలో నిద్రాణమై జాగృతమైన యమూల్య దివ్య కవితాశక్తితోబాటు మాతృశ్రీచే ప్రేరేపితమైన నాలోని యలౌకిక దైవశక్తి తోడై ముందుకునెట్ట మాయిలవేల్పు అయిన శ్రీవేంకటేశ్వరునిపై శతకము వ్రాయ నా కసాధ్యమైన, నలతి పాండిత్యముచే యతి సాహసమున నుద్యుక్తుడనైనను, నాస్వామి నా కేల్పట్టి నడిపింపం బద్ధకాలమునకుం బూర్తి చేసితిని. అటులనే సుప్రభాతం వాంధ్రీకరించుటయు, స్వామివారి యపార కృపా విశేషము కాక మరేమి? ఇందున తటస్థించిన సంఘటనలు ముచ్చటించుట ప్రస్తుత మప్రస్తుతము కాదేమో!

నా యీ శతక రచన తరుణాన నొక రాత్రి శ్రీస్వామివారు సర్వాలంకార భూషితులై దివ్య తేజోవిరాజితులై సాక్షాత్కారము బరదీనొసంగ భరితుండనైన నాటి సన్నివేశము మరపురానిది.

ఒకసారి నా యసంపూర్ణ శతక వ్రాతప్రతిని గోల్పోయి వినిగి వేసారినై, వ్యథపడి బెంగతో దైవముపై భారముంచి "నా శతకము దొరికినచో సహృదయులు నా కందజేసిన కృతార్థుడనౌదును అట్లు కాదేని దానిని స్వామివారి సన్నిధిని పఠింపవలసి యుందునని" దండోరా వేయించిన మరుక్షణమున నాకది యందుట విచిత్రము.

ఈ కృతులు పూర్తియైన తర్వాత కైలాశపట్నంలో వేంచేసియున్న శ్రీరాజగోపాలస్వామివారు సన్నిధిని భక్తమిత్ర బృందముతోగూడి నేను పఠించుచుండగా "మిరియాల నరసింహమూర్తి గారిపై స్వామివారు కన్పించి పూర్తియగు పర్యంతమట్లే యుండి ప్రసన్నులై హారతిగొని చనిన సంఘటన శ్రీస్వామివారి వైభవమునకు మచ్చుతునుక.

"శ్రీవేంకటేశ్వర సుప్రభాత శతక మాల" ముద్రణకు నా కోరిక మన్నించి దయతో తగుద్రవ్య సహాయమందించి చేయూత నొసంగిన శ్రీతిరుమల తిరుపతి దేవస్థానము కార్యనిర్వహణాధికారి వారికి—

ఈ కృతులను సావధానముగా పరిశీలించి నా యందలి వాత్సల్యముచే తమ యమూల్యాభిప్రాయము లందజేసిన — శ్రీసుంకరణం వేంకట రామకృష్ణారావు గార్కి, శ్రీవంగపండు సర్వేశ్వరరావు గార్కి, శ్రీ కలగ రామ జోగేశ్వరశర్మ గార్కి, నా యభ్యున్నతి నాశించి యితోధిక సహకార మందించిన సన్మిత్ర మండలికి, శ్రేయోభిలాషులకు —

ఈ గ్రంథమును చక్కగా ఆకర్షణీయముగా ముద్రించి యందించిన శ్రీరాధాకృష్ణ ప్రింటింగు ప్రెస్ యజమానులు శ్రీబాలేపల్లి గంగరాజు గార్కి మరియు సిబ్బందికి కృతజ్ఞతలు, పఠితలకు మనవి ఈ గ్రంథము శ్రీస్వామివారి దివ్యచరణాంకితమై మీ చేతిపూజాపుష్పమై. ఇందలి భక్తి భావము సహృదయసముద్ర ముద్రాంకితమై సదా బ్రహ్మానంద సంధానములుగా మిమ్ములఁ జేసిన నా జన్మ నా కృషి సాఫల్యమైనట్లే ఇందలి దొరలిన నెరసులను దయతో మన్నించి మీ యమూల్యాభిప్రాయము లందించి నన్ను మఱింత ప్రోత్సహింతురు గాక!

ఇట్లు
బుధజన విధేయుడు

మంగవరం
23-4-93

**తేజోమూర్తుల వేంకటేశ్వరరావు**

# ప్రార్థన

కం॥ శ్రీలక్ష్మీనారాయణ!
లీలామానుష సురూప! లేఖాధ్యక్షా!
లాలిత శోభిత వసమా
లాలంకృత! సూత్రధారి! ప్రాంజలిగొనుమా! 1

కం॥ శంకర! మృత్యుంజయ! అభ
యంకర! కందర్పహర! విషమాక్షా!
కింకర! సంరక్షక! శ
శాంకధర! ఉమాప్రియా! నమోస్తు మహేశా! 2

కం॥ ధాతా! ఘటనాఘటన వి
ధాతా! జలజప్రసూతి! ధర్మజ్ఞా! నీ
వ్రాత యమోఘమ్ము భయ
త్రాతా! దయజూపుమయ్య దండమొనర్తున్ 3

కం॥ తొలుతగ నినుఁదలచిన వే
తొలగవె విఘ్నంబులెల్లఁ ధూర్జటిపుత్రా!
తొలుత గొలిచి చేఁబట్టితి
కలమును సుత్పృకృతమహిమఁ గావ్యరచనకున్ 4

కం॥ శ్రీరమణీ! కళ్యాణీ!
నారాయణి! హేమవర్ణ! నాదవినోదీ!
శ్రీరంజని! వరలక్ష్మీ!
దారిద్ర్య వినాశనకరి! దయగొను జననీ! 5

కం॥ శక్తి త్రయావలంబన
శక్తీ! అగజా! అపర్ణ! శంకరపత్నీ!
రక్తాక్షీ! నిగమాగమ
సూక్తా! కైమోడ్చి కొల్తు శుభములొసగుమా 6

కం॥ వాణీ! పుస్తకధారిణి!
వీణాపాణీ! శుభాంగి! విజయకరీ! ఇం
ద్రాణీ ప్రముఖ్య బహు గీ
ర్వాణీ సంసేవ్యచరణ! వర్ణింపుమదిన్ 7

గీ॥ ప్రార్థనానంతరంబున వాసి గాంచు
పూర్వ కవివతంసుల కెల్ల మ్రొక్కులిడుచు
నొక్క శుభముహూర్తమున నుత్సహించి
గ్రంథరచనకుఁ దీక్షతోఁ గడగినాడ 8

గీ॥ సంస్కృతంబునఁ మున్న విశ్వమునఁ వెలసి
విపులవిఖ్యాతిగొన్న "శ్రీవేంకటేశ
సుప్రభాత స్తవ మహిమ" సులభ శైలిఁ
దేట తెనుగునఁ దీనిఁ దీర్చువాఁడ 9

కం॥ నిన్నే నిత్యముఁ దలచెడి
నన్నుం గడు కనికరమున నాదరమున వేఁ
గన్నులఁ గాపాడెడి వెం
కన్నా! వే యందుకొమ్ము గ్రంథముఁ బ్రీతిన్ 10

శ్రీరస్తు   శుభమస్తు   అవిఘ్నమస్తు

శ్రీ వేంకటేశాయ నమః

# శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము

సీ॥ కౌసలేయ! రఘూద్వహ! కమలనయన!
ప్రాగ్దిశ నుదయింపఁ బోవఁగ భాస్కరుండు
దైవకార్యముఁ దీర్పంగ తరుణ మాయె
పాలనంబు సేయగ లెమ్ము పరమపురుష! 1

సీ॥ శ్రీశ! జగదీశ! చిద్రూప! జీవపోష!
గరుడ కేతన! కేశవ! శర్ఙ ధారి!
దేవ! గోవింద! గోపాల! దీనరక్ష!
విశ్వ శుభకర! వేలెమ్ము! వేంకటేశ! 2

సీ॥ వేంకటాచల నాయక! విశ్వరూప!
వాంఛితార్థ ప్రదాయిక! వాసుదేవ!
సకల కల్మష సంహారి! శాంతమూర్తి!
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 3

సీ॥ శ్రీనివాస! మంగళకర! శిష్టభూష!
ధర్మసంరక్ష! విశ్వేశ! దానవారి!
శౌరి! భక్తవశంకర! సత్యదేవ!
దేవ! సుప్రభాతంబయ్యె! తిరుమలేశ! 4

సీ॥ నాథ ! లోకైకనాథ ! త్రినాథ ! భూత
నాథ ! శ్రీనాథ ! హరిహరనాథ ! వేద
నాద ! ఆనందసంధాత ! ఆదిదేవ !
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 5

సీ॥ సాధు సత్సంగ సేవిత ! సహనశీల !
భక్తవత్సల ! చిన్మయా ! ప్రణవరూప !
దీనజన శరణచరణ ! దేవదేవ !
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 6

సీ॥ అంబ ! జగదంబ ! మధుకైటభారి హృద్వి
హారిణీ ! దివ్యవిగ్రహా ! అబ్ధిరాజ
తనయ ! శ్రితజాభీష్ట ప్రధానశీల
సుప్రభాతంబు శ్రీదేవి ! సుప్రసన్న 7

సీ॥ కమల ! కమలాసన ! సువర్ణ కమలవర్ణ !
జలజలోచన ! ప్రసన్న చంద్రవదన !
హర విరించేంద్ర వనితార్చితాంఘ్రిపద్మ !
సుప్రభాతంబు భార్గవీ ! సుప్రకాశ !

సీ॥ సప్త ఋషులెల్లఁ శ్రద్ధమై సంధ్యవార్చి
సురనదీజాత సుమనోజ్ఞ సరసిజముల
పదయుగము భక్తిఁ గొల్వ ప్రపన్నులౌచు
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 9

గీ॥ హర, విధాత, షణ్ముఖ, వాసవాది సురలు
దివ్య త్రైవిక్రమాది త్వదీయ చరిత
మెన్న దినశుద్ధి పఠియింప నింద్రగురుడు
దేవ! సుప్రభాతం బయ్యె తిరుమలేశ ! 10

గీ॥ అరవిరిసిన వరసరోరుహములు, నారి
కేళ, కదళి, పూగ తరువరాళి కొసగు
మంద మారుత సహ దివ్య గంధ మలమె
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 11

గీ॥ కనక పంజరస్థ శుకాళి కనులు తెఱచి
పార్శ్వ పాత్రావశిష్ట పక్వఫల పాయ
సముల గుడిచి పాడదొడగె సంతసమున
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ; 12

గీ॥ మధుర సుస్వన మొల్కించు మహతిఁ సారె
సారెకు స్మరించుచు ననంత చరిత మహహ!
నారదుఁడు శ్రావ్యగాన మొనర్పసాగె
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 13

గీ॥ మధుర మధురసాస్వాదన మత్త షట్ప
దాళి ఝుంకార గీతిక లాలపించు
కొలని తమ్ముల వీడి నిన్ గొల్వఁబూని
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 14

గీ॥ గొల్ల యిల్లాండ్రు మేల్కాంచి గోకులమున
చల్ల చిల్కంగ గల్గు సస్వనము చెలంగె;
కకుభ కుంభముల్ సల్పెడి కలహమేమొ
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 15

గీ॥ కమల శతపత్ర సంస్థ భృంగముల గములు
కువలయశ్రీ నపహరింప గోరి తీవ్ర
నాద మొనరించె; భేరీనినాదమట్లు
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 16

గీ॥ భక్తవత్సల! అభీష్టవరద ! అఖిల
లోకబంధు ! విశ్వైకదయైకసింధు !
శ్రీనివాస భుజాంతర శిష్టమూర్తి !
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 17

గీ॥ స్వామి పుష్కరిణిన్ మున్గి స్వచ్ఛదేహు
లగుచు హర, విరించి సనందనాది మునులు
శ్రేయమాశించి వాకిట చేరినారు
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 18

గీ॥ వృషభగిరి, శేష శైలమ్ము. వేంకటాద్రి,
గరుడు, నారాయణాద్రి ముఖ్యమ్ములైన
సప్త గిరులు త్వదీయ వాసమ్ములంద్రు
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 19

గీ॥ అష్ట దిక్పతులు హస్తాంచ వరుస నెంచి
శిరములందాఁ గేల్మోడ్చి నీ చెంతనిల్చి
వేచియున్నారు సేవింప వేంకటేశ!
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 20

గీ॥ హయ, విహగ, నాగ, మృగ, గజాద్యధిప చయము
ప్రాంజలించుచు స్వస్వాధిపత్య దివ్య
వైభవంబుల నర్థింప వచ్చి కొల్చె
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 21

గీ॥ నిరతము నవగ్రహంబులు నీదు భక్త
కోటి దాసానుదాసులై కొల్చువారె
భవదనుగ్రహసిద్ధికై ప్రస్తుతించె
దేవ ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ; 22

గీ॥ స్వర్గ మోక్షా ద్యపేక్ష లేశమ్ము లేక
త్వత్పదార్పక బృందము తల్లడిల్లె
భావి కల్పాగమము నెన్ని భావమందు
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 23

గీ॥ స్వర్గ మోక్ష పథమ్ముల జనెడు జనులు
రమ్య భవదీయ గోపురాగ్రముల గాంచి,
పుడమి జన్మించి నినుఁ గొల్వఁ బుద్ధి నెంత్రు
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ ! 24

సీ॥ శ్రీ మహేశ! సగుణాది గుణామృతాబ్ధి
అఖిల లోక శరణ్య! దేవాది దేవ!
శేష గరుడాది నిత్య సంసేవ్య చరణ!
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 25

సీ॥ పద్మనాభ! జనార్దన! వాసుదేవ!
శౌరి! పురుషోత్తమ! వికుంఠ! చక్రపాణి!
వామనా! శరణాగత పారిజాత!
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 26

సీ॥ దివ్య మోహనాకార! సందీప్తహేడ!
శ్రీ కుచాబ్జ కుట్మలలోల దృక్సరోజ!
దివ్యకీర్తి! పావననామ! భవ్యచరిత!
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 27

సీ॥ శ్రీహరి! మత్స్య, కూర్మ, వరాహ, నృహరి!
వామనా! పరశ్వధరామ! రాఘుచంద్ర!
హలధరా! యదుకృష్ణ! కల్క్యవతార!
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 28

సీ॥ నందివాహనమిత్ర! ఆనందనిలయ!
పక్షపాతరహిత! పటపత్రశయన!
భక్తిముక్తిప్రదాత! శ్రీవత్సచిహ్న!
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 29

సీ॥ పరిమళ మిళిత దివ్య పావన జలంబు
పూర్ణ హేమపాత్రలఁ దెచ్చిఁ మోదమలర
వేచియున్నారు సేవింప వేదవిదులు
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 30

సీ॥ అర్కుఁడుదయాద్రిఁ బొడఁగట్టె, నంబుజములు
విచ్చె, దిక్కులు మార్మ్రోగ విహగ కూజి
తముల శుభము గోరుచు నిల్చె దాసకోటి
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 31

సీ॥ అతుల భక్త్యతిశయమున నమర వరులు
మానులు సనుదనాదులు మంగళకర
వస్తు హస్తులైనారు నీ ప్రాంగణమున
దేవ! సుప్రభాతంబయ్యె తిరుమలేశ! 32

సీ॥ సతత లక్ష్మీనివాస! ఓ సాధుశీల!
ఘోర సంసార సాగరోద్ధార! దివ్య
ప్రాభవోపేత! శ్రుతినుత! భక్త భాగ్య
దేవ! సుప్రభాతంబయ్యె! తిరుమలేశ! 33

సీ॥ ప్రతిదినము భక్తి తోడఁ బ్రభాతమందు
సుప్రభాతమ్ము పఠియించు సుజనవరుల
కెలమి పరమార్థబుద్ధి లభించునంత
జన్మ చరితార్థమగుటకు సాధనమగు 34

# 2 శ్రీ వేంకటేశ్వర స్తోత్రము

కం॥ కమలా కుచ చూచుక కుం
కుమారుణీకృత నీలదేహా! కువలయనాథా!
కమలా యతలోచన! విజ
యమగుత నీకెపుడు వేంకటాచల వాసా! 1

కం॥ సురవర వందిత చరణా!
అరుణేందు నయన! మహా దురితాంతకరణా!
శరణాగత వాత్సల్యా!
పరిపాలింపవె ననున్ బ్రపన్నార్తి హరా! 2

కం॥ అతి విషయాసక్తుండనై
అతిహీన పథమ్ముం బట్టి యజ్ఞానముతోఁ
అతి వేలము నేఁ జేసిన
శతాపరాధముల సైచి సాకుమ దేవా! 3

కం॥ తిరుమల వేంకట నాయక!
పర దేవత వన్చు శ్రుతులు వాకొనె నన్నన్
వరదా! ఉదార మానస!
పరులం గోరను రమేశ! పరసాధన్నకె 4

కం॥ మురళీ మనోజ్ఞ రవళీ
పరవశ గోపీజనాళి పరివేష్టితుఁడౌ
స్మరకోటి సమాకారుని.
వరరాసవిహారుఁ గాక పరు నే గొలువన్ 5

కం॥ రామా! అభిరామగుణ
స్తోమా! ఇనవంశసోమ! తోయద మంజు
శ్యామా! దశరథ తనయా!
ప్రేమన్ గని యభయ మీవె వేద విహారా! 6

కం॥ మహిమాన్విత! రఘురామా!
మహిజా మానస మరాళ! మంగళ రూపా!
మహనీయ! రావణ తమో
మిహిరా! శీతాంశు వదన! మేలు భజింతున్ 7

కం॥ వందే గీతాకారా!
వందే యద్వైతమూర్తి! వందే విష్ణూ
వందే యనంత! శ్రీహరి!
వందే శబ్దార్ధరూప! పరిశుద్ధాత్మా! 8

కం॥ బ్రహ్మము నీవై బాసిలి
బ్రహ్మాండము నావరించు పావనమూర్తీ!
బ్రహ్మజ్ఞాన విభూషిత!
బ్రహ్మానంద భరితముగ భజియింతు నినున్ 9

కం॥ నీవే రుద్రుఁడ వజుఁడవు,
నీవే నా ప్రాణధనము, నేతవు నీవే,
నీవే సకల విధాతవు,
నీవే దాతవు, గురుఁడవు, నిక్కము దేవా! 10

కం॥ వందిత పాదాంబురుహా!
సుందర వదనా! సుధీర! సుమధుర వాఙ్మీ!
బృందావన సంచారీ!
బృందారక బృందసేవ్య! వృషభగిరీశా! 11

కం॥ శుద్ధ మనోజ్ఞా కారా!
శుద్ధాంతఃకరణ నిలయ! సులభ వశకరా!
బుద్ధావతార! నిన్నుఁద్రి
శుద్ధిగ మదినిల్పి కొల్తు శ్రుతిసూక్తములన్ 12

కం॥ హరి! జార చోర పదములు
సరాసరిగ నీకుఁ గట్టి పంతసమొందున్
పరమాత్మా! అజ్ఞానుఁడు
పరమార్థంబెఱుఁగకయె వివాదము బెంచున్ 13

కం॥ దిక్కెవరాఖిల జగతికిఁ
దిక్కెవ్వరు సాధువులకుఁ దీనుల కెప్డున్
దిక్కెఱుఁగక నీదిక్కై
ప్రొక్కెద మొఱవినుచు నాకు మోక్షము నిమ్మా 14

కం॥ ఆర్త త్రాణ పరాయణ!
మూర్తిత్రయమున కభేదమూహించి మనః
స్ఫూర్తిగ నమ్ముచు నిన్నే
స్ఫూర్తిం బొందగ నుతింతు సూనృతపాలా! 15

కం॥ ఇలలో దలచెడి వారల
కలతలు త్రుటిలో నణంచు కలియుగ దేవా!
కలి దౌష్ట్యము తొలగించుము
దళితాఖిల దైత్య! మమ్ము దయఁ బ్రోవుమయా! 16

కం॥ ఓంకారవాచ్య! సకలా
హంకార! వినాశకారి! అమృతాకారా!
సంకల్పసిద్ధ! అచ్యుత!
వేంకటనాయక! నమోస్తు విశ్వకర్తా! 71

కం॥ శ్రీయుతమా నీ మూర్తిం
బాయక మది నమ్మి కొల్చు భక్తులకు సదా
చేయూత నిత్తువనియెడి
ధ్యేయముతోఁ సంస్తుతింతుఁ దిరుమలవాసా! 18

కం॥ మాయాతీతా! ప్రాణులు
మాయాజాలమునఁ జిక్కి మసలుదురు సుమీ
మాయకుమా కనులెప్పుడు
మాయను ఛేదించు శక్తి మాకిమ్ము హరీ! 19

కం॥ సువిశాల మంజుహృదయా!
సుకీర్త్యవంతా! సుకాయ! సుఖదా! సులభా!
అవతారపురుష! నినుగా
కెవరిని పొగొలుతునయ్య! ఇక రఘురామా! 20

కం॥ నీ కన్న నాథుఁడీ ధర
నా కెవ్వరు వేఱు లేరు నాదశరీరా!
వాకొందు ననంతశయన!
చేకొని నీ చెంతఁ నిల్పు శేషాద్రీశా! 21

కం॥ దూరమున నుండి కొలువం
గోరిక నేతెంచి రాహు కొంతను భక్తిన్
సారెకు రాజాలను వే
మారుం నినుఁగొల్చు ఫలము మాకిమ్ము దయున్ 22

కం॥ అహమిక చేఁ గనుఁ గానక
విహరించిన మూర్ఖమతిని వేంకటపతి! మ
ద్విహితా శేషాఘావళి
తుహినమ్మును భానుభంగిఁ దొలఁగింపు హరీ! 23

కం॥ శ్రీ వేంకటేశ నుతి గా
జీవాంతమ్మును పఠించి సేవించెడి యా
శ్రీవైష్ణవులకు నేరుగ
కైవల్యము చేతిలోని కనకము కాదే! 24

# 3 శ్రీ వేంకటేశ్వర మహిమ

గీ॥ విమల వాత్సల్యశీల ! శ్రీ విష్ణుకాంత !
తత్ హృదయ నిత్య సద్మ ! తత్సహన శీల
వర్ధనీ ! కమలాసన ! పద్మ పాణీ!
భగవతీ! జగదీశ్వరీ ! వందనంబు 1

గీ॥ శ్రీధరా ! కరుణానిధి ! శిష్ట సులభ!
సర్వ శేషి ! శక్తా ! కృత సర్వలోక !
స్వామి ! సర్వజ్ఞ ! ఆశ్రిత పారిజాత !
విమల చరణాలె శరణు శ్రీ వేంకటేశ! 2

గీ॥ అందియలబంటి నర్చితమైన యట్టి
పూల తావికి నెత్తావి ప్రోదిసేయు
సతము క్రొంగ్రొత్త రుచుల హృద్యతరమైన
విమల చరణాలె శరణు శ్రీ వేంకటేశ ! 3

గీ॥ నవ నవోత్ఫుల్ల సాంద్రారుణ సుపరిమళ
సౌకుమార్య సరోరుహ సామ్యవార్త
సాహస పదాల వన్నెలు నంతరించు
విమల చరణాల శరణు శ్రీ వేంకటేశ్వర !

గీ॥ భవ్య వరతత్త్వ చిహ్నాలౌ వరలు శంఖ
చక్ర వజ్రాంకుశాంబుజ చ్ఛత్ర కల్ప
కేతనామృత కలశ రేఖాది రుచిర
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ! 5

గీ॥ ప్రబల తామ్రోదర పరాస్త పద్మరాగ
ప్రభలు, మహేంద్ర నీలాభ బాహ్యరుచులు,
అమల నఖకాంతి విజిత శంశాంక కళలు
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ! 6

గీ॥ ఇందిరా సభయ ప్రేమ మృదుల పాణి
యుగ్మ సంవాహనా వ్యథాయుత మనోజ్ఞ
సరస వాఙ్మనసాతీత సౌకుమార్య
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ! 7

గీ॥ లక్ష్మి, భూమియు, నీళాది లలన లెల్ల
నర్చ లిడగ తత్కర పల్లవారుణిమలు
సోకి సాంద్రారుణమ్ములై శోభలెసగు
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ! 8

గీ॥ సంతతా నమద్విధి మహేశ్వర మహేంద్ర
మకుట కోటీర నవరత్న మహిత కాంతి
దివ్య నీరాజనావిధి దీప్యమాన
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ!

గీ॥ విష్ణు పదము పరమ్మను వేదసూక్తి
అదియె యనుభోగ్య మకరంద మనెడు యుక్తి
దయను నీ పాణి వేని తథ్యమని చూపు
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ ! 10

గీ॥ పార్థ సారథివై తొల్లి పార్థు ప్రీతిఁ
శరణు వేడుకొమ్మనిన నీ చరణ యుగళి
నీవె చూపు చుంటివి కదా నేడు నాకు
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ ! 11

గీ॥ నా తలను, కాళియునిపై వనమ్ములందు,
వేంకటాచలాగ్రంబున, వేదశిఖల.
పరమ హంసల హృదయాల వరలునట్టి
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ ! 12

గీ॥ పుడమి వికసించి వాసని పుష్పములయి
భూషలై వేంకటాద్రికిఁ బొలుపు గూర్చి
సకల జనమనోనయన హర్షప్రదాయి
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ ! 13

గీ॥ పట్టెదరు వేని మొదట ప్రపన్ను, లేవి
తల్లి కుచయుగ్మ మట్లమృతమ్ము గురియు
ఒకటి కొక్కటి సాటియై నొందులేని
విమల చరణాలె శరణు శ్రీవేంకటేశ!

గీ. సాత్త్విక జన ప్రవరవర్గ సతత సేవ్య!
ఘోర సంసార సాగరోద్ధార ! సౌమ్య
ముని కనికరమ్మున శరణ్య మనుచుఁ దెల్పు
విమల చరణాల శరణు శ్రీవేంకటేశ ! 15

గీ॥ శ్రీశ ! నీవు పేయుఁడవైన సిరిఘటించు
ప్రాప్యుడవు నీవు గాఁగ తాఁ ప్రాప్త యగును
దేవ ! నిత్యాశ్రితా ! ప్రభూ ! తిరుమలేశ !
దాసుఁడను నీకు; లేదు స్వాతంత్ర్య మెపుడు 15

# శ్రీ వేంకటేశ్వర కరావలంబ స్తోత్రము

సీ॥ శేషగిరి సునికేతన! చిద్విలాస!
ఆదినారాయణాచ్యుత! అబ్జనేత్ర!
నిరుపమ కటాక్ష రక్షిత నిఖిల లోక!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 1

గీ॥ సర్వ లోకైక సమ్మాన్య! సార్వభౌమ!
శంఖ చక్రాది యుక్త ప్రశస్త హస్త!
జీవకారుణ్య సాగర! శేషశాయి!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 2

గీ॥ అఖిల నిగమాంత వేద్య! భవాబ్ధిపోత!
పద్మనాభ! రమార్చిత పాదపద్మ!
పతిత పావననామ! సత్త్వగుణపూర్ణ!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 3

గీ॥ నిగమలక్ష్య! లక్ష్మీపతీ! నిర్వికల్ప!
కామముఖదోష పరిహార! జ్ఞానదాయి!
పాపదైత్యాంతకా! ప్రభూ! వాసుదేవా!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 4

గీ॥ ప్రత్న నవరత్న ఖచిత సువర్ణ మకుట!
నిబిడ కస్తూరి శోభిత నిటల పటల!
పూర్ణ చంద్రబింబ వదన! పుణ్య సదన!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 5

గీ॥ అఖిల సంసారు జనవరదా! దయాబ్ధి!
భూరి నవరత్న భూషిత భూషితాంగ
హైమ కేయూరభూషితా శావకాశ!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 6

గీ॥ కృపను తాపత్రయంబు హరించుదేవ!
వేగ రక్షింపుమీ నన్ను బిసరుహాక్ష!
సతము నా శిష్యు బ్రోవుమా చక్రపాణి!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 7

గీ॥ సామగాన ప్రియ! అనంతనామధేయ!
జీవ చైతన్య కారక! క్షేత్రపాల!
దుర్నిరీక్ష్య! పరంధామ! త్రోవజూప
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 8

గీ॥ ప్రముఖ దివ్యాంగనాంచిత బాహుయుగళ!
దివ్య కేయూర భూషణ దీర్ఘ బాహు!
పన్నగాధిప కంకణ పద్మ పాణి!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 9

గీ॥ సకల దివ్యాంగ రాగ ప్రచర్చితాంగ!
పీత వస్త్రపరీవృత! విపుల తేజ!
స్వచ్ఛ సౌవర్ణ పరిధాన పట్టబంధు!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 10

సీ॥ కనక రత్న ధామ నిబద్ధ కటిని వేశ!
చారు మాణిక్య దర్పణ జానుదేశ!
జంఘ యుగ్మ సమ్మోహిత సర్వలోక!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 11

సీ॥ పరమ పావనధామైక భాసితాంఘ్రి!
త్వత్ప్రదాదిత్యదీప్తి సందర్శనమున
యెదను నిండిన చీకట్ల నెల్లఁ బాపి
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 12

సీ॥ అధిప! సంసార జలధి మధ్యమునఁ జిక్కు-
కొంటి, కరుణాపయోనిధీ! కూర్మిఁ జూపి
పాదసేవకు నికనైన నాదుకొనుచు
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 13

సీ॥ షడ్గుణ విజేతకే ప్రాణసఖుఁడ వగుచుఁ
కృపను సకల దరిద్రమ్ము లెల్లఁ బాపి
దీనజనులఁ గటాక్షించు మాననీయ!
వేగ చేయూత నిమ్ము శ్రీ వేంకటేశ! 14

సీ॥ ప్రభువ! నీ పాదరేణువై ప్రబలి యున్న
శ్రీ నృహరి యతిచే విరచింపబడిన
దీనిఁ ద్రిశుద్ధిగ పఠించెనేని కడను
పరమ వైకుంఠవాస సౌభాగ్య మబ్బు 15

# 5 శ్రీవేంకటేశ్వర మంగళాశాసనము

గీ॥ శ్రీరమాకాంత! విస్మయా! శ్రీనివాస!
సకల కళ్యాణ మందిర! స్వప్రకాశ!
అర్థిజననిధి! శ్రీవేంకటాద్రివాస!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 1

గీ॥ అనుపమవిలాస! లక్ష్మీకటాక్షహృష్ట!
విభ్రమ విలోల లోచన! విమల హాస!
సర్వ లోకైక నేత్ర! యుజ్వల సుగాత్ర!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 2

గీ॥ వేంకటాచల శృంగాగ్ర విలస దమల
మంగళోజ్వలాభరణాయమానపాద!
అఖిల మంగళవాస! దివ్యప్రభావ!
మంగళంబిదె నీకు పద్మాసమేత!

గీ॥ భువన మోహన సున్నిగ్ధమూర్తి! భక్త
తోష! విశ్వవినోది! నిర్దోషవర్తి!
భూరి భూతదయాసాంద్రపూతగాత్ర!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 4

గీ॥ సర్వభూతాంతరాత్మక! సర్వశేషి!
సచ్చిదానంద! మాధవా! శ్యామలాంగ
భక్తసులభ! పరాత్పర! పాపరహిత!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 5

గీ॥ స్వామి! పరమాత్మ పరతత్త్వ! పరమహంస!
పూర్ణకామ! పరబ్రహ్మ! మోక్షదాయి!
ఆర్తిహర! ఆశ్రితావన! ప్రాప్తకీర్తి!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 6

గీ॥ సమయగణనమ్ము లేక నిచ్చలును పూని
తృప్తిఁజెందక యాత్మ దర్శించు యోగి
వరుల కమృతస్వరూప సంభావ్యమూర్తి!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 7

గీ॥ నరులకేనాడు భవదీయ చరణయుగము
పరమ శరణమ్ముగా నీదు వరదహస్త
సంజ్ఞచేఁ జాటుచుండెడి సత్యరూప!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 8

గీ॥ చిత కరుణాతరంగిణీ శీతలోర్మి
మాలికలవలె స్వకటాక్షమాలికలను
విశ్వమెల్లదను ముంచెత్తువే మూర్తి!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 9

గీ॥ భూషణాంబరాయుధ సర్వ పుష్పతతికి
అమల శోభ ఘటించు సర్వార్తి శమన!
దివ్య మంగళ విగ్రహా! దీప్త తేజ!
మంగళంబిదె నీకు పద్మా సమేత! 10

గీ॥ శ్రీవికుంఠవిరక్తుఁడై శేషగిరిని
స్వామి పుష్కరిణీ తీర సద్మమందు
దేవితో సదా క్రీడించు దేవదేవ!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 11

గీ॥ మంగళాశాసనము దెల్పు మాన్యులైన
సుందర పరమ హంస హృన్మందిరమున
సర్వ జగములందు వసించు సర్వసాక్షి!
మంగళంబిదె నీకు పద్మాసమేత! 12

గీ॥ మంగళాశాసనము చేయు మద్గురునకుఁ
పూర్వ గురువరేణ్యుల చేతఁ బూజలంది
నట్టి శ్రీ వేంకటేశ! అవ్యక్తరూప!
మంగళంబిదె నీకు పద్మా సమేత! 13

గీ॥ మంగళాశాసనమ్మును మనసు నిల్పి
పరమ భక్తితోఁ బఠించు నరునకు ప్ర
యత్నముగ శోభనంబగు, నాత్మశుద్ధి
నొంది నేరుగ విష్ణు సాయుజ్యమొందు 14

శ్రీరస్తు          శుభమస్తు          అవిఘ్నమస్తు

శ్రీవేంకటేశాయనమః

# శ్రీ వేంకటేశ్వర శతకము

1 శ్రీకాంత! శ్రీకర! శివకర! సాకార!
శ్రుతిసార! శుభకర! శోభకార!
అక్షరా! నాజీవ నాధార! దీనద
యాకర! సర్వ తాపాపహారి!
అజ్ఞాన తిమిరాపహారి! ఓంకార బీ
జాంకుర! అఖిల ధర్మావతార!
జ్ఞానాబ్జ భాస్కర! సద్భక్త మందార!
నిఖిల లోకాధార! నిర్వికార!
హరి! పరాత్పర! వర పురుషావతార!
సుమనస విహారి! సుందరా! సూత్రధారి!
ఘోర సంసార సాగరోద్ధార! నమతి
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 1

సీ॥ వేడిన వరమిడు వేల్పుగా భావించి
చపల చిత్తంబును సంస్కరించి,
నిశ్చల దీక్షతో నియమ యుక్తంబుగా
భక్తిమైఁ గ్రొత్తలఁ బ్రాఁజలించి,
ఉత్సాహముప్పొంగ నుఱ్ఱూతలూగుచు
శతకంబు రచియింప సాహసించి,
శ్రీకరంబైనట్టి శ్రీకారముంజుట్టి
నీ మహాత్మ్యంబు వే నెన్నుకొంటి
బుద్ధిబలమిడి నడపింతువో మఱేశ
నేమి సేయఁబూనితివొ మాయింటి వేల్ప !
నీటముంచిన దేల్చిన నీకె చెల్లు
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 2

సీ॥ జనన కారకులైన జననీ జనకులకుఁ
బాదాభివందనం బాచరించి,
విజ్ఞాన దీపంబు వెల్గించి నిల్పెడి
యాచార్యవర్యుల నాదరించి
కవితామతల్లిని ఘనముగ నర్చించు
సత్కవిశ్రేష్ఠులఁ బ్రస్తుతించి,
ఆస్మదభ్యున్నతి నాశించు నాప్తులఁ
గడు వినమ్రుండనై గౌరవించి
వేదమూర్తులై దీపించు విప్రవరులఁ
సాధు సత్సంగులఁ సఖులఁ సంస్మరించి,
వ్రాయ నెంచితి నీ ప్రభావంబుచేతఁ
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 3

సీ॥ తాండవ వాహినీ దరి పరిశోభిత
శ్రీరామపుర నివాసి ద్విజవరుఁ
పరితః గోత్రీయుఁ బవిరళ దేవతా
ర్చన దీక్షితుఁడను ధర్మాభిరతుండు
సుచరితుండమల "తేజోమూర్తు లాన్వయ"
జాతుఁడు, మాన్యుఁడు, సహనశీలి,
గవరాఖ్య పౌత్రుండు, ఘనుఁడు, వాస్తు, జ్యోతి
ష, ముహూర్త, రాజప స్మార్త వేత్త
ఆర్య రామగోవింద సిద్ధాంతి సుతుఁడ
భవ్య దివ్య పాదాబ్జ సేవకుఁడఁ బుధమి
"వేంకటేశ్వర" నామాభి విలసితుండ
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ!

సీ॥ సంస్కృతాంధ్ర గ్రంథజాలంబు లత్యంత
శ్రద్ధమీరగనైనఁ జదువనైతి
అజ్ఞానముంబాపి సుజ్ఞానమందించు
పరమహంసలకడఁ గడుపనైతి
ఆదర్శమూర్తుల నడుగు జాడలఁ బట్టి
శక్తిహీనుండనై సాగనైతి
ప్రాగ్భవశమున వ్యసనలోలుండనై
యింతదనుక తత్త్వ మెఱుగనైతి
దివ్యశక్తి యొకండు మ్రోడి దీప్తినొంది
భక్తి నాలో వెల్లివిరియఁ బరవశించి
వినుతిసేతు నీరీతి నీ విభవమేను
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ!

సీ॥ పదుగురి మెప్పుకై ప్రాకులాడియు కాదు
విద్వాంసుడనని గర్వించి కాదు
సత్కీర్తిభావాలఁ సమకూర్తుననికాదు
పొట్టకూటికిఁ సమకట్టలేదు
ఆత్మబలంబునఁ యత్నించినికాని
ఘనకీర్తి నార్జించఁ గాంక్షలేదు
పరిమితకాలము వ్యయము కారాదను
తపన తప్ప యితర తలపులేదు
గురుల బోధనా సారంబు గుర్తెఱింగి
శతక లక్షణంబించుకఁ జారనీకఁ
ఆర్యసూక్తులఁ దలఁదాల్చి యల్లుచుంటి
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 6

సీ॥ విజ్ఞాన సరసిలోఁ వింతకాంతులనీను
భావపద్మంబులఁ బరచియుంచి
మతిఁబరామర్శించి యతిగణయుతయుగ
రమ్యగుణంబులఁ రంగరించి
లలితార్థ యుక్తిగ రసబంధురంబుగ
మృదు పదబంధంబు మేళవించి
జాను తెనుగు సోన జాలువాఱు నటుల
శ్రవణపేయంబుగ సంతరించి
జన్మరాహిత్య సిద్ధికిఁ సాధనాన
అంకితమొనర్తు నీకృతి నందుకొనుచు
శుభము లొసగి దీవించుమా సుప్రసన్న!
వేఁకటాచలవాస! శ్రీ వేంకటేశ! 7

సీ॥ శ్రీవత్సలాంఛనా! శ్రితజనవత్సలా!
అఖిల నిగమసూక్త! యాగభోక్త!
సురవర భూషిత! సుమధుర భాషిత!
మునిగణ పూజిత! పూతచరిత!
గోవింద! గోవింద! గోకులానంద! ము
కుంద! చిదానంద! వందనీయ!
వాఙ్మనసాతీత! పరమాత్మ! జీవాత్మ!
శ్రీరమేశ! సురేశ! జీవితేశ!
ఆగ్రహానుగ్రహధురీణ! అగ్రగణ్య!
సర్వలక్షణాలక్షితా! సామలోల!
వేదవిదిత! ఉపాసింతు విశ్వబాహు!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 8

సీ॥ శ్రీవిలాసముఁ జూచి చిత్తబిఃకముఁ జారఁ
జిఱునవ్వు మోముసఁ జిందులాడఁ
యోగనిద్రవిడచి, యొకతూరి తలయూచి,
చిత్తజుచెయ్వులఁ జిత్తగించి,
శ్రీదేవి నలరింపఁ శృంగార కేళిలో
సంతోష జలధిని జలకమాడి,
తీవ్రమోహంబునఁ స్థితిమఱచి సతిని
మత్తిలి చిత్తాన హత్తుకొనఁగ
అలిగి భృగుమౌని వామాంక ముందుఁ దన్నఁ
సత్వరమ్ము తత్పదమంటి శాంతుగతిని
గర్వమడచితి ముంగాలి కన్నుఁజిదిమి
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 9

సీ॥ అవమాన భరమునఁ వ్యథనొంది భార్గవి
స్వస్థానముఁ వదలి చనిన వేళ
విరహాగ్నిఁ గసుకుంది పరిపరి విధములఁ
విసిగి వేసారినై వెదకి తుదకు
అటునిటు తిరుగాడి యటఁ గనఁ జాలక
ఘోర తపమునకుఁ గూడఁ గడగి
వల్మీకగర్భానఁ వాసమ్ముఁ జేసి, గో
క్షీరంబు కడుపార నారగింపఁ
కుపిత గోపాలుఁ డద్దాని గొట్టఁబోఁ
వ్రేటువడి చోళవిభుని శపించి నావు
తప్పు కావుమన్న విముక్తిఁ జెప్పినావు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 10

సీ॥ భక్త వకుళ గృహ ప్రాంగణంబున్జొచ్చి
నిజరూపమున నట నిలిచి పిలువఁ
ఆత్మగతంబున నామాత భవదీయ
దివ్య తేజముఁ గని తెప్పరిల్లి
ముసిముసి నగవులు మోమునఁ నిండార
సర్ఘ్య పాద్యాలతో నాదరించి
పట్టు పుట్టంబులు కట్టనిచ్చి కొసరి
తృప్తి మీరంగ నాతిథ్య మిచ్చి
పుత్ర వాత్సల్యముప్పొంగ బుజ్జగించి
చెల్లు వేయువా ఋణమని చేరదీయఁ
జన్మ ధన్యమొనర్చిన సమగుణనిధి!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 11

సీ॥ వన్యమృగముఁ బెంబడించెనని, యాకాశ
రాజసుత గని రాగమొంది,
ఆశ వదలలేక యన్యచింతన మాని
దీనవదనుఁడవై తిరిగివచ్చి,
అన్నపానాదులం ద్యజియించి, యతిశయ
విరహాగ్నికిం జిక్కి వేఁగి, స్రుక్కి,
సారెకు నామెనే స్వాంతానఁ జపించి
ధృతిచెడి వేఁగొంచు తెరవు లేక,
పూర్వ వృత్తాంతము స్పష్టముగను తెల్పి.
వకుళమాలపై జతకూర్చ భరము మోపి,
పనిచి రసభరితముగ కథ నడపితివి
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 12

సీ॥ ఆకాశరాజ కన్యకఁ జెట్టపట్టంగ
వకుళమ్మచేఁ రాయబారమంపి,
ఎఱుకతవై యేగి యెలమి పద్మావతిఁ
జూచి హస్తముఁబట్టి సోదెఁజెప్పి,
వారలనొప్పించి వచ్చిన కథ మాత
మోమున నాలించి మోదమంది,
బంధు మిత్రాదులఁ బరివారముల నాహు
తింప వాహనముల నంపినావు
సర్వ కార్యాలు లెస్సగ నిర్వహించు
చతురమతివి నీ కన్యల సాయమేల?
చిత్ర చిత్ర ప్రభావ! విచిత్రవేష!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 13

సీ॥ సకుటుంబ బాంధవ సపరివారంబుతో
కైలాసనాథుండు కదలివచ్చి,
సావిత్రి, గాయత్రి, శారదాసహితుఁడై
సత్యలోకేశుండు సాగి వచ్చి,
దేవేరులం గూడి దిక్పతు ల్పంచభూ
తంబులు వేగమై తరలివచ్చి,
సప్తర్షి, దేవ, రాజర్షి చయంబులు,
సతులఁ దోడ్కొని దివిషత్కులంబు,
సూర్య చంద్రులు, చుక్కలు, నాథ వేల్పు
వచ్చి కొల్చి తరించె నీ పరిణయంబు
సాంగముగఁ జూచు భాగ్యమ్ము సంభవింపఁ
వేఁకటచలవాస, (శ్రీ) వేంకటేశ! 14

సీ॥ వృషభాద్రి పూర్వ సుకృత మెట్టిదో కాని
యొక్కచోఁ లోకము లొప్పవన్న
దిగ్భ్రాంతిఁ గల్గింపఁ ద్రిజగన్నుత విచిత్ర
విభ్రాజిత సభను విశ్రమింపఁ
కల్పనా చాతురీ గరిమ నింపెసలార
సహజ జీవద్రేఖ జాలువాఱఁ
చక్కందనంబుతోఁ సాక్షాత్కరింపగ
నిరవద్యముగఁ బహునిష్ఠతోడఁ
అతులగుణములఁ గలగల్పి యతిసురుచిర
రసము లొక్కరాశిగఁ జేర్చి రచనఁ జేసి
ప్రీతినర్పించి మెప్పించె విశ్వకర్మ
వేంకటాచలవాస! (శ్రీ) వేంకటేశ! 15

సీ॥ తల్లికిచ్చిన మాట తప్పక తలపోసి
గూఘట్టు మాకృతి యతికి నావె,
లంకలోఁ బొల్లి ధరణిజకుఁ మాఱుగ
వేదనఁ బొందిన వేదవతికిఁ
వాగ్దానమిచ్చిన వరము దీర్పంగ యు
ద్వాహమునకుఁ సిద్ధపరచినావు
ధనపతి నర్థించి ధనమెల్లఁ గైకొని
యప్పు వడితివి బ్రహ్మదు లెదుట;
శాపమొందియు భవదీయచరణయుగళిఁ
గడఁగి సాలంకృతంబుగఁ గన్య నివ్వఁ
గడమ మోక్షమిచ్చితివి యాకాశపతికి
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 16

సీ॥ వనవాస దీక్షకై పినతల్లిపై భార
ముంచి నాటకము నాడించినావు
స్త్రీమానరక్షకై చెలిమి సుగ్రీవుతో
నొనరించి వాలినే దునిమినావు
శరణార్థియౌ విభీషణుని భక్తికి నిచ్చ
మెచ్చి యభయదాన మిచ్చినావు
ధర్మరక్షార్థమై దశకంఠునిఁ జనికి
నీతిని జగతిని నిల్పినావు
నరునిగాఁ బుట్టి జాతికే తిరుగులేని
ఎన్నికొని తెచ్చి యాదర్శ పథముఁ జూపు
నట్టి భవదీయలీల లత్యద్భుతంబు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 17

సీ॥ అలిమైకై వనమెల్ల గాలించి శోకించి
పడరాని యిక్కట్లు పడితివేల?
దైత్యులఁ దండింప తపన సూనుని సహా
కారము స్వయముగ కోరనేల?
జానకి జాడకై చారుల తోడుత
వాయుకుమారునిఁ బనుపనేల?
దానవేంద్రుని తీవ్రదార్ష్ట్యములఁ మఱచి
దాస్యమొనర్ప సిద్ధపడనేల?
రావణాదులతోడ బోరాడు నాడు
వానరులఁ దండు తోడు కావలసివచ్చె
అద్వితీయప్రభావ! అవ్యక్తరూప!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ!

సీ॥ శ్రీవత్సమునకైన, శ్రీగంధమునకైన, 18
తులసికైన, ఘనకస్తూరికైన,
పన్నగేశునికైన, వైనతేయునికైన,
పాలకడలికైన, వనజకైన,
వటపత్రమునకైన, వనమాలకైన, చ
క్రాదులకైన, శ్రీలక్ష్మికైన,
యోగివరులకైన, భాగవతులకైన,
సురరాజుకైనను, శ్రుతులకైన,
కార్తికేయునికైన, విఘ్నపతికైన,
వాణికైన, హిమజకైన, బ్రహ్మకైన,
హరునికైన, నీ మాయ గోచరము కాదు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 19

సీ॥ ఎవ్వని యాజ్ఞచే నీమహావిశ్వముల్
ప్రభవించి వర్ధిల్లి లయము నొందు,
ఎవ్వని మాయచే నీజీవసంఘంబు
లుత్పన్నమొందుచు నుప్పతిల్లు
ఎవ్వనిరక్షచే నీసృష్టిపోషణ
సవ్యంబుగా కొనసాగుచుండు,
ఎవ్వని మహిమచే నెల్లమహాపాత
కంబులు పంచబంగాళమౌను
ఎవ్వని కటాక్ష వీక్షణ మీసమస్త
భక్తకోటి కలభ్య కైవల్య మిచ్చు
వట్టి వాడ వీవె అపాకృతావతార!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 20

సీ॥ వైకుంఠమే నిజవాసమై చెన్నొంద
పవనేశనేంద్రుడు పాన్పుకాగ,
శ్రీదేవి, భూదేవి శృంగార మొల్కింప
వినతాత్మజుండు వాహనముకాగ,
దిజ్నాథులర్చింపఁ దేవతల్ మ్రొక్కంగ
విబుధమునులు సదా వినుతిసేయఁ
పంచభూతంబులు పరిచర్య లొనరింపఁ
శంఖచక్రాదులు చక్కనుండ
సూర్యచంద్రులు దివ్యచక్షువులుకాగ
అంబరము ఘన శ్వేత ఛత్రంబుకాగ
అవని నవతరించితివి శిష్టాళికావ
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 21

సీ॥ వేదాల సృష్టించి విధికై వశమొనర్చి
సృష్టికర్తను ప్రతిష్ఠించి నావు,
విశ్వంభరునిగ దీపించి గౌరీశుని
లయకారకునిగ నేర్పరచినావు
పాలనార్ధంబు దిక్పాలకుల నిలిపి
దేవేంద్రుని పతిగఁ దీర్చినావు,
వేగురవాంత్ర నియోగించి కర్మసా
క్షిగ దిననాథునిఁ జేసినావు
క్రమము దప్పనీక సతము క్రమము గాను
సృష్టికార్యము పర్యవేక్షించి దిద్దు
వేల్పువౌర! లోక బాంధవా! విశ్వరూప!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 22

సీ॥ పంచభూతాలతోఁ బ్రహ్మాండముల నిల్పి
లోకుల నేర్పుతోఁ లో నిమిడ్చి
గ్రహరాశి నక్షత్ర గమనరీతులఁ బట్టి
ప్రాణికోటి గతుల వ్రాసియుంచి,
ధర్మ సూత్రముఁబట్టి, కర్మ పాశముఁజుట్టి,
కాలచక్రముఁ ద్రిప్పి, కట్టుకట్టి,
మోహితులం జేసి. మురిపించి మఱపించి
తుదిముట్ట భ్రాంతిలోఁ ద్రోసివేసి,
సకల భూతగణాలకుఁ సహజ మనుచు
చావు పుట్టువు లమరించి చాటినావు
యెచట నేర్చినావౌరౌర! యిన్నికళలు?
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 23

సీ॥ అంపసి వాటికై యాశ రేకెత్తించి
యతివిచిత్రంబుగ నడతువేమి?
క్షణములో జీవులఁ గలిపినట్లే కల్పి
బహునిపుణముగ వేర్పరతువేమి?
ఉన్నతపదమిడి యూహించరానట్లు
నీచస్థితికిఁ దిగనెట్టెదేమి?
అనుభవింపగ సర్వమందించి యాశచే
జేసాపఁ దూరంబుఁ జేతువేమి?
పాప పుణ్యంబులఁ బట్టి ప్రాణులగతి
మార్చి యొక్కొంత తడవల్లు మసలనిచ్చి
నెట్టి బహు జన్మలిత్తువు నిర్మలాంగ!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 24

సీ॥ విషమ పరీక్షలు వెట్టి పరీక్షించి,
నిగ్గుఁదేల్చి విలువ నిర్ణయించి,
జీవకోటి స్థితి చిత్ర చిత్రంబుగ
నతిసమర్థంబుగ నాక్షణంబె
ఎంతమాత్రంబు రవ్వంత తొట్రుపడక
నిష్పాక్షికంబుగఁ నిందలేక,
పెత్తనమ్ము వహించి, క్రొత్తములుపుఁద్రిప్పి
కర్మ ఫలితమిచ్చు కర్మసాక్షి!
ఎంచి యెంచి వీక్షించిన నించుకించు
కైన లోటు రానీయక గారడీఁడు
మాడ్కి లోకుల స్థితి గతుల్ మార్చగలవు
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 25

సీ॥ గర్భస్థ శిశువున కాత్మజ్ఞతఁ గలిగి
వెలువడు నంతనే వీడిపోయి
ప్రకృతి పంజరమున బంధియై యాత్మాంత
రాత్మల యాంతర్య మరయకుండి
లోలత్వమునఁ బడి డోలాయమానుఁడై
జ్ఞాననేత్రము మూసి, సంచరించి,
అంత్యకాలాన బ్రహ్మజ్ఞాన మొదవినఁ
బ్రాణోత్క్రమణమునఁ బాసిపోవు,
కర్మఫలముతోఁ యోగము కలగలుపుచుఁ
మోక్ష మీయవే యగ్నిపరీక్ష పెట్టి
భళిర! నీ విలాసము గణింప వశమౌనె?
వేంకటాచలవాస, శ్రీవేంకటేశ! 26

సీ॥ ప్రాణులఁ దృష్టికై బహువస్తుజాలముఁ
గోరకయే సమకూర్చి యుంచి,
అరమరఁ జూపక యందఱ నుభవింప
నానతించి సమస్త మప్పగించి,
అగణితైశ్వర్యంబు లమరసౌఖ్యంబుల
నిగ్గ రసమ్ముల సిద్ధపరచి,
మరపు తెరవు జతపరచి హద్దుల నిచ్చి
స్వర్గ నరకములఁ సంఘటించి
తెరమరుగునుండి యతిరమ్యదృశ్యతతులఁ
వివిధ గతుల నేర్పడఁ గనువిందొనర్చి
అందకుందువే యూహకు సుందరాంగ!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 27

సీ॥ శ్రీచరణజ గంగ శ్రీకంఠునిల్లాలి
    యై లోకపావని యగుచునొప్పె
తత్పాద చిహ్నంబు తెలఁదాల్చి ధన్యుఁడై
    ఫణిరాజమేయ ప్రఖ్యాపుఁడయ్యె
శంఖుఁడెట్టాని ప్రసాదంబుగా నెంచి
    గళసీమఁ గొని లయకారుఁడయ్యె
శ్రీమహాలక్ష్మి నీ హృదయాన వసియించి
    జగదైక మాతగా స్తవము నొందె
అంబుజ సముద్భవుండు బ్రహ్మత్వమొందె
భవదనుగ్రహంబు లభింప వలయుఁగాని
నమ్మికొన్న వానికి నాశమెద్ది?
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 28

సీ॥ కొలది సాయపడిన గుహుని భక్తి కలరి
    తడయక పరమపద మిడినావు,
సౌమిత్రి సేవకుఁ సంబరపడిఁ వడి
    తీరికగ ఋణముఁ దీర్చినావు,
పత్ని జాడెఱిగించు పక్షిరాజును మెచ్చి
    సాన్నిధ్యమునఁ జేర్చి, సాగినావు,
మారుతి యుపకృతిఁ మఱవక దీవించి
    చిరంజీవిగా నాడు జేసినావు,
శరణు వేడిన యా విభీషణు సమాద
రించి లంకేశునిగ నొనరించినావు
అహహ! యేమి నీ వాత్సల్య మహిమగరిమ
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 29

సీ॥ పంకాన పద్మమ్ము ప్రాదుర్భవించి, సు
  స్థిరముగ నీ నాభిఁ జేరి, నిలచి
చంద్రసహోదరి సంభవస్థానమై
  విశ్వజనీనమై వినుతిఁగొంది
శారదాధవున కాసనమై విరాజిల్లి
  ప్రస్తుతింపఁబడి ప్రాబల్యమొందె,
కావ్యాలలోఁ జేరి గణనీయమై వర్ణ్య
  వస్తువుల్ సరసన వరుసఁ జేరి
ధన్యుల కర చరణము లందమరియుండి
భాగ్యవశమున నుత్కృష్ట పదవులంది
ఆఖ్య గొనుట భవదనుగ్రహంబు కాదె
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 30

సీ॥ అపరిచితులకుఁ గాఢానుబంధముఁ బెంచి
  క్రొంగ్రొత్త జంటలఁ గూర్చ గలవు,
కలతలు పుట్టించి, కన్నీరు కార్పించి,
  తీవ్ర పరచి వినోదించఁ గలవు
జీవన యాత్రలోఁ జితికిని జీవులఁ
  శీఘ్రమై నొకదరిఁ జేర్చఁ గలవు
అహమునఁ నడచినఁ నడుసునఁ దాటిపం
  పదుము తెలంగున నదుమ గలవు,
కూర్మిఁ జూపించి ముదముఁ జేకూర్చ గలవు
అపగతుని బ్రతికించ గలట్టి దిట్ట
నిఖిల భూతవినుత! నీకు నీవె సాటి
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 31

సీ॥ వైకుంఠమునఁ దివ్యవైభవోన్నతుఁడవై
  మెప్పుల నొప్పుచు నున్న నీవె
గండ్రాతిలోఁ దాఁగి మంటబొంతకు మాడి,
  దడివానకుం జిక్కి శక్తి యుడిగి,
నిలువ నెలపు లేక, విలువ చెడి, తిమిరాన
  పెక్కేండ్లు క్రుంగి యే పేరులేక
పుట్టలో తుప్పలోఁ బుట్టి యనాథవై
  యాకటిబాధ కల్లాడిపోయి,
నివురు గప్పిన నిప్పువై నిలచి, యున్న
తాసనాసీనుఁడ వగుట యమిత వింత,
విధి లిఖితమా? విలాసమే వేఱుగాదు
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 32

సీ॥ ఆగర్భ శ్రీమంతుఁడవై యున్న నేమి? యే
  ప్రొద్దునందైన కైమోడ్చి నిలచు,
అసమాన బలయుతుఁడవై యున్న నేమి? యే
  క్షణమునందైన మస్తకము వంచు,
అఖిల జగన్నుతుఁడవై యున్న నేమి? యే
  తరుణమందైన డెందానఁ దలచు
అతిక్రూరకర్ముఁడవై యున్న నేమి? యే
  సమయాన నెందైన సాగిలపడు
పరమనాస్తికుఁడవై యున్నవాఁడు కూడ
తప్పకుండ గ్రహించు స్వధర్మపథము
వంద్యుఁ డెవ్వఁడు నీకన్న? ప్రాణనిలయ!
వేంకటాచలవాస, శ్రీ వేంకటేశ! ౩౩

సీ॥ పొగడినఁ బొంగవు, తెగడినఁ గ్రుంగవు
జగడంబు లాడినఁ జతెఁ గలుషవు,
తలచిన పలుకవు వలచిన మురియవు
కన్నీరు కార్చినఁ గరుగఁబోవు
అపనింద మోపిన నదరవు బెదరవు
హేళన చేసిన హేయపడవు
అలిగిన నించుక నలుగవు కనుకట్టి
వెలిపెట్టి నెట్టినఁ గలతఁపడవు
వికృత చేష్టలొనర్చినఁ విసిగి కొనవు
కఠినముగ కాలదన్నినఁ గసరు కొనవు
సరళహృదయ! ఘనంబు నీ సహనశక్తి
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 34

సీ॥ "నారాయణా!" యని నమ్మి సేవించిన
దుర్గుణముల దొంతి తూలిపోదె,
"మధుసూదనా!" యని మనసార కొల్చిన
సర్వ సంగమములు జారిపోవె,
"దామోదరా!" యని దండంబు వెట్టిన
పాపాంధకారంబు పై దొలగదె
"సర్వేశ్వరా!" యని స్మరణంబు సేసిన
బ్రహ్మ తత్వజ్ఞత వట్టుపడదె
నిత్య పారాయణమ్ముగఁ నీ కథార
సంబు తనివార జుర్రినఁ జాలు నీదు
దివ్య రూపదర్శనము సిద్ధింపకున్న
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 35

సీ॥ నీలమేఘశ్యామ! నీ వాసమెద్దియో
పాలకడలియొ, జీవాత్మలోనొ
వటపత్రశయన ! నీ పరివారమెద్దియో
భక్తబృందంబో సుపర్వులొనొ
సంకర్షణా! నీదు సంకల్ప మెద్దియో
పాలనంబో కుజన భంజనంబో
అద్వైతమూర్తి! నీ యాకృతి యెద్దియో
ప్రాణంబులో దశరూపంబులొనొ
సచ్చిదానంద! మదినొక్క సంశయంబు
యిట్టి ద్వైవిధ్య భావంబు లేలకల్గె?
సత్య మెఱిగింప రాదెకో నిత్య సత్య!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 36

సీ॥ నిర్గుణునిగ వర్ణనీయుండ వైనను
సగుణునిగా కొనసాగినావు
నిర్వికారుండవై నిర్ణయింపబడుచు
సాకారుండ వనుచు చాటినావు
నామరహితునిగ నమ్మజేసి యనంత
నామధేయునిగ ఘనత వహించి,
విశ్వమూర్తిగం వెల్లడింప బడియు
విశ్వాంతరాత్మవై వెలసినావు,
నాస్తికులకు, మూఢాత్ముల కస్థిరులకుం
పారమార్థిక జ్ఞాన తత్పరులకొఱకు
భక్తి తత్త్వమిా క్రియం దేటంబఱచినావు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 37

సీ॥ భాగ్యవంతుండైన, భాగ్యహీనుండైన,
  సత్యసంధుండైన, నధముఁడైన,
ధర్మిష్ఠుఁడైన, నధర్మపరుండైన,
  గామియైనను, మోక్షగామియైన,
ఆస్తికుఁడైనను, నాస్తికుఁడైనను
  పరమ పావనుఁడైనఁ బతితుఁడైన
శిష్టుఁడైనను, కడుదుష్టుఁడైనను, ప్రాణ
  మిత్రుఁడైనను, బద్ధశత్రువైన
సాధ్వియైన, పతితయైన, చపలయైన,
భోగియైనను, విషయ విరాగియైన.
సములుగారె నీ దృష్టికిఁ జ్ఞానగమ్య!
వేఁకటాచలవాస! శ్రీవేంకటేశ! ౩౮

సీ॥ పరమేష్ఠి సృష్టికిఁ బ్రతిసృష్టి సల్పిన
  కౌశికుఁ డేరీతి ఘనత కెక్కె
వినువీథి కెగసిన వింధ్యాద్రి శీర్షంబు
  నయ్యగస్త్యుండెటులణఁగఁ ద్రొక్కె
గంగనొక్కుమ్మడి గటగట జహ్నువి
  ద్రుక్కెడో నట్లెట్లు ద్రోల గల్గె
నిర్మల తటియైన నీ యంకపీఠంబు
  గర్వియై భృగువెట్లు కాలఁదన్నె,
అట్టి మహిమంబు లబ్బుట యబ్బురంబు
నీదు తోడ్పాటు లేకున్న నెగడ గలరె
సత్త్వగుణసాంద్ర! సర్వజ్ఞ! సాధులోల!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! ౩౯

సీ॥ కక్కుస కూటికి కల్లలాడెడివాఁడు
కూటికై నీచులఁ గూడువాఁడు
పచ్చని కొంపకుఁ జిచ్చు పెట్టెడివాఁడు,
వంచనకే తల వంచువాఁడు,
అన్య సంపత్తుల నాహరించెడివాఁడు,
ప్రాణులఁ బీడించి బ్రతుకువాఁడు,
సత్పురుషుల మాట సాగనీయనివాఁడు,
చెనటియై ధర్మంబు చెఱచువాఁడు.
మూర్ఖత త్యజియించి సద్బుద్ధిఁ గల్గి
జీవితాంతంబు విధిగ నర్పించె నేని,
పావనునిగఁ జేతువు కదా పతితు నైన
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 40

సీ॥ కర్మ మనుష్ఠించి, ధర్మనిష్ఠాతుఁడై
సత్య వ్రతముఁ గొనసాగనిచ్చి,
జీవహింస త్యజించి, దయాంతరంగుఁడై
పర హితార్థమునకుఁ బాటుపడుచు,
పెద్దలఁ సేవించి, పిన్నలఁ బ్రేమించి,
మానమ్ముఁ బాటించి, మంచిఁ బెంచి,
ఆశ దిగవిడచి, యాత్మ నీ కర్పించి,
సత్సంగులంగూడి శమమునొంది
నియమ నిగ్రహంబులతోడఁ నీతిఁదప్ప
కున్న యే యొక్క సద్గుణ మున్న చెంతఁ
జేర్చుకోవె సమ్మదమున శిష్ట రక్ష!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 41

సీ॥ పావని గంగాభవానికే జన్మస్థానమై పూతమై తనరె నెద్ది?
బాహువిస్ఫూర్తితోఁ బగతుల నొంచిన
బలి సార్వభౌముని వంచె నెద్ది?
పాషాణ రూపాన పడియున్న గౌతము
పత్నికిఁ శాపంబుఁ బాపె నెద్ది?
గర్వాంధుఁడైనట్టి కాళియు శీర్షాన
నతి సురుచిర నాట్యమాడె నెద్ది?
అఖిల లోకేశులఁ నివాళులందిన మాన
నీయమై, నిత్య సత్యమై, నిలచె నెద్ది?
నీ పదయుగ మఖిల రక్ష! స్నేహతత్వ !
వేంకటాచలవాస ! శ్రీ వేంకటేశ ! 42

సీ॥ భాగ్యవంతుఁ డొకఁడు, భాగ్యహీనుఁ డొకఁడు
పిసినారి యొక్కఁడు, భిక్షు వొకఁడు,
పండితుం డొక్కఁడు, పామరుఁ, డొక్కఁడు,
సంసారి యొక్కఁడు, సాధు వొకఁడు,
సుందరాంగుం డొకఁ డందహీను, డొకఁడు,
బల యుతుఁ డొకడు, దుర్బలు డొకండు,
సంతాన భరమునఁ వంత నొందు నొకఁడు
వారికై యాశించు వాడొకండు,
బుద్ధిమంతుఁ డొకఁడు మందబుద్ధి యొకఁడు
సృష్టిలో నిట్టి వ్యత్యాస మేల? పూర్వ
కర్మ ఫలమ? సంసారాబ్ధి కర్ణధారి !
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 43

సీ॥ పెన్నుద్ది ప్రాలైన వేదాలఁ దొత్తెచ్చి,
గిరిన త్తి సుధఁబంచి, ధరఁ భరించి,
ప్రహ్లాదు రక్షించి, వంచించి బలి నొంచి
దుష్ట భూపాలురఁ దునిమి దునిమి,
దశకంఠుఁ బరిమార్చి, ధరణి భారముఁ దీర్చి,
త్రిపురాసురులఁ సంహరింప కార
కుఁడవై, జగన్నాయకుఁడవై, కలియుగానఁ
బ్రత్యక్ష దైవమై ప్రబలి, వరలి,
తలచి నంత మనోవాంఛితములఁ దీర్చు
కలుష విధ్వంసి! ఆశ్రిత కల్పభూజ!
నీ మహోపకారంబుల నేమరతుమె?
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 44

సీ॥ ఎట నుండి వచ్చి నీ వెట్లు పెరిగితివో,
తలిదండ్రు లెవ్వరో తెలియరాదు,
ఏ జాతి వాడవో, యే మతస్థుండవో
యే కులజుండవో యెఱుక లేదు
ఏ గోత్రజుండవో యే స్వరూపుండవో
జాడఁ దీయుట కైన సాధ్య పడదు,
జ్ఞాన సంపన్నులు చాటి చెప్పి నట్టి యీ
పెక్కు గతులు మది కెక్క బోవు,
వేద వేదాంగము లొకింత విపుల పరచె
తఱచి చూడఁ నీ తత్వ మర్థంబు గాదు
ఎన్ని జన్మల కైన నిన్నెఱుగ తరమె
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 45

సీ॥ ముదుర తమస్సులోఁ మూలవిరాట్టువై
వైకుంఠమునఁ బెక్కు వత్సరములు,
పాల కడలి యందు వటపత్రమునఁ గాఢ
యోగనిద్ర మునిగి యోగమొంది।
శ్రీమహాదేవినిఁ జేకొని హృదయ త
లమునఁ సతముఁ బదిల పరచుకొని,
సర్వనియంతవై, సర్వోపగతుఁడవై
స్వప్రకాశుండవై, ప్రతిఫలించి.
పెక్కు భిన్న తత్త్వంబుల నొక్క రీతిఁ
జేసి, యేకాకృతిం దోచి, జీవ చేత
నత్వ శక్తి ప్రసాదించు నారసింహ!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 46

సీ॥ స్థావర జంగ మాద్యఖిల లోకమ్ములు
నిరవశేషంబగు, నింగి వంగు,
సూర్య చంద్రులడంగు, చుక్కలు తెగిపడు,
గ్రహ సమూహంబులు రాలిపోవు,
పంచ భూతాళి ప్రభావమ్ము క్షయమగు,
కాల స్వరూపంబు కనుమఱుఁగగు,
కల్పాంతమునఁ సర్వ కర్మంబు లంతమై
స్వర్గ నరకములు పతన మౌను,
అఖిలము లయత్వమొంది శూన్యంబు మిగులు
గాఢ తిమిరాన నొంటివై కట్ట కడను
వెలసి యుండు పరంజ్యోతి వీవె సూవె
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 47

సీ॥ కామాంధకారానఁ గన్ను మిన్నుఁ గనని
మూఢజనుల కీవు బుద్ధి సెప్పఁ
ఈతి బాధలతోడ నిహలోకమునఁ గ్రుగ్గి
నరక యాతనవడు నరులఁ బ్రోవఁ
పాపభీతి విడచి భక్తులఁ బీడించు
దుష్ట సంఘంబులఁ ద్రుంచి వేయఁ
కలిమాయచే నతి కలుషాత్ములై మెల్గి,
ప్రక్క త్రోవఁ ద్రొక్కు వారిఁ జూచి.
ధర్మ సంస్థాపనార్థమై ధాత్రి మీద
వివిధ రూపాల నొప్పుచు వెలయుచున్న
ఆర్త రక్షణ గుణధామ! అదుకోవె
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 48

సీ॥ ఏడేడు జగముల నేలేటి మాస్వామి
మేలుకో యికనైన మేలుకోవ
మానవత్వము తెరమఱుగునఁ బడిపోవఁ
సజ్జనాళికి నిల స్థానమేది?
నీ కన్నెదుట నవినీతి ప్రబలు చుండ
నీయుపేక్షాభావ మేలనయ్య?
కన్నాకునై సదా కాపాడు నాయకా!
కఱడు గట్టిన మదిఁ గలుగ నిమ్ము
విశ్వకళ్యాణ మొనగూర్చు విమలమూర్తి!
కలి వెతమ్ము రమ్ము చక్రమ్ము పట్టి
తుడిచిపెట్టు మధర్మమ్ము దుఃఖహరణ!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 49

సీ॥ కరి మొఱాలించి మకరి మీఁద చక్రంబు
విడచి ఖండించుట పెద్దతనమొ
గురుని వాక్యంబుపై గుఱి నిల్పి ధనువెత్తి
తాటకి నొంచుట ధైర్య గుణమొ
చెలికాని రక్షింపఁ జెట్టు చాటునఁ డాగి
వాలినిఁ జంపుట పౌరుషంబె
పాలియ వచ్చిన పడతిని బల్మిమై
కూల నేయుట మేటి గొప్ప తనమొ
కలియుగానఁ నానాటికిఁ గలత రేఁపు
నాస్తికుల మీఁద శీఘ్రంబు నాయుధంబు
నెక్కు పెట్టు వనఁ దెలియు నొక్క పెట్టు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ 50

సీ॥ దుర్భర దారిద్ర్య దుఃఖా కలితులైన
దీనాతిదీనులఁ దిద్ద వేల?
సంఘ విద్రోహుల చర్యలఁ గమనించి,
యక్కసు దీరగఁ ద్రొక్క వేల!
పరమత ద్వేషులై వక్ర గతింజూపు
దుండగులఁ గొలగఁ ద్రోయ వేల?
వర్ణ సంకీర్ణులై వావి వరుస వీడి
వర్తించు భ్రష్టులఁ వంచ వేల?
అంతరించె ధార్మిక చింత యంత కంత
కు కలి చెలరేగె, ధర్ముఁడు కుంటి కమలె
శాంతి కను మఱుగై నను శాంత మేల?
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ 51

సీ॥ సిరిగలవానికే చెల్లుబాటే కాని
పేదవానికి నగుఁబాటు కల్గు
పండితునకు సర్వ వైభోగములు కాని
పామరునకు భంగపాటు మిగులు
అధికారికే గౌరవాదరంబులు కాని
బానిసీడుకు నపవాదు రగులు,
బలయుతునకు నాధిపత్య మబ్బును కాని
సజ్జనాళికి మనశ్శాంతి లేదు
లంచగొండికిఁ బ్రజ బ్రహ్మరథము పట్టు
వాయిగల వానిని వరించుఁ బ్రబల కీర్తి
ధార్మికునకుఁ గలియుగానఁ దారి కలదె
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 52

సీ॥ హైందవ సంస్కృతి యటుగారి నెత్తెక్కి
పాశ్చాత్య సంస్కృతి ప్రబలి వరలి
మంత్ర తంత్రయుగముల్ మటుమాయమైపోయి
యణుయుగ మ్మింక ముందంజవేసి,
బహుళ వైజ్ఞానిక ప్రగతి సాధించుచుఁ
బ్రకృతి నెదురొడ్డి ధ్వజము నెత్తి
మారణాస్త్రమ్ముల మారకమ్ము పెఱిగి
ధర్మ మార్గంబును తప్పుచుండె
మదమునఁ గెరలి చెలరేగి మర్త్యకోటి
కడకు గణుతించదే నిన్ను కాలమహిమ
కాక మఱియేమి? దేవ! కల్క్యవతార!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 53

సీ॥ తీర్థయాత్రల కేగి తీర్థానఁ గ్రుంకినఁ
దనదు శక్తిని భూరి దానమిడినఁ
వేవెల నెలకొల్పి కొలను త్రవ్వించినఁ
సత్రముల్ వెట్టించి సాయ పడినఁ
అన్నార్తులకుఁ బట్టెడన్నము పెట్టుచుఁ
పరుల బాధలుఁ దీర్పఁ బాటుపడినఁ
సత్సంప్రదాయంబుఁ జక్కఁగ పాటించి
మానపత్వంబునఁ మసలు కొనినఁ
సౌమ్యుఁడై సముఁడై, విశ్వశాంతి నభిల
షించి జీవ కారుణ్యాన జీవయాత్ర
చేయువారలకుఁ శుభము, చేతువయ్య
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 54

సీ॥ ప్రారబ్ధమునఁ గతవాసనా కల్మమై
నుర్విపై బుట్టుట యొండుతప్పు,
బ్రహ్మచర్యంబును పాటింపక జటినై
యుద్వాహమొందుట యొండు తప్పు,
తీవ్రమోహాన నస్థిర మనుస్కుండనై
బిడ్డలఁ బొందుట పెద్దతప్పు,
కర్మసిద్ధాంతపు మర్మమెఱుంగక
గర్వినై తిరుగుట కాని తప్పు
తప్పు లన్నియు స్వయముగ నొప్పుకొంటి
చిన్న బుచ్చక యోర్మిమై చింతఁదీర్చి
తప్పు కావుమా మాధవా! తనువు నీకె
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 55

సీ॥ ఉర్విపైఁ బడు నప్పు డొకవంక కబళింపఁ
 వెన్నంటి మృత్యువు వేచి యున్నఁ
వయసు నానాటికిఁ బైబడి తరుముచుఁ
 గతముఁ గప్పుకుఁ బొడఁగట్టుచున్నఁ
సన్న సన్నగ జవసత్త్వంబు లడుగంటి
 ముదిమిపైఁ గప్పుచుఁ ముసురుచున్నఁ
వెఱ్ఱియూహలఁ బడి విలువైన కాలంబు
 చేఁజారె ననుచుఁ సూచించు చున్నఁ
పరిణమించక పెడతల పట్టు బుద్ధి
ఆశ చావీక నిక్కువ మ్మరయ నీదు
ఏల నీనిరర్థక జన్మ శ్రీనివాస!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 56

సీ॥ వయసు పెరుగుచుండు, వాంఛ లుడిగిపోవు,
 మనసు కట్టువడదు, మాయగప్పు,
కాలసా కదలాడు, గతము వెక్కసమాడు,
 మధుర స్మృతులఁ జాడ మసక బారు,
మోహమా వదలదు, బుద్ధి చెదరి పోవు,
 యాయు వేమొ తఱుగు, యహము పెఱుగు,
మలిన దేహంబుపై మమకారమా పోదు,
 యఖిల బంధనములా యడ్డగించు,
పాడు మనుగడపై రోత పొడము చుండు
పరము సాధింప నారాట పడుట తప్పు
అంత కంతకు నాకది యందకుండు.
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 57

సీ॥ పంతాన యెట్టైనఁ బట్టి నుంకించిన
నొక్కచోఁ స్థిరముగ నుండబోకఁ
ఇహ వాంచలకెగసి యింద్రియబింకానఁ
వెఱవక, తడయక, బిడియపడక,
పట్టు పగ్గములేక, పరువు పంచల నెట్టి,
స్వైర విహారము సల్పి సల్పి,
అంతు తెలియనంత వింత పోకడలతోఁ
నంత కంతకు యింది యందకుండ
మించి, వంచించి, కవ్వించి, మేరమీరి
వికృత చేష్టల హొప్పుచు వెంట నంటి
కష్టపెట్టు మాయమనసు కట్టుటెట్లు?
వేంకటాచలవాస శ్రీ వేంకటేశ! 58

సీ॥ ఈ మహాసృష్టిలో నేనెంత చింతింపఁ
యణువునో పరమాణు వౌదునేమొ
నా బ్రతుకెంత? అనంత కాలగమన
మ్మును సమీక్షించినఁ బుద్బుదంబు
తెరవెఱుగక, యతితెగువ బూనక నిటు
యెట్టటో జీవిత మీడ్చు చుంటి,
కలవర పాటునఁ గలగుండు పడుమది
నీ వేడుగడవని నిమ్మళించి,
నారు పోసిన నాథుఁడే నీరుపోసి
పెంచ కుండునా యను నాశ పెంచుకొంచు
వేచియుంటి సత్ఫలిత మీవే యుపేంద్ర!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 59

సీ॥ స్వాతివానకు మోము వాచి నిరీక్షించు
ముత్తెపు చిప్పనై మోకరిల్లి,
నెలవంక రాకకై కళవళ మొందెడి
రత్నాకరమునై నిరాశపొంది,
ప్రియ దర్శనార్థమై విక్షోభిత మృదుల
కలువ కుమారినై కలత నొంది,
వర్షించు మేఘములకై భగ్నహృదయ మగ్న
వనమయూరంబునై పలవరించి,
నవవసంత సంస్పర్శకు నలమటించు
ప్రకృతికాంతనై క్రుమ్మరి క్రుగ్గుచుంటి
అన్యథా శరణం నాస్తి యార్తిహారి!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 60

సీ॥ నానుండి చిన్నతనపుఁ జేష్టలెల్ల సు
దూరమ్ము కాలేదు తోయజాక్ష!
దుందుడుకుతనంబు, తొందరపడు బుద్ధి,
యెన్నడు బాయునో చెన్నకేశ!
ఇంద్రియ బింకంబు నేప్రొద్దునందైన
వక్రగతినిఁ ద్రోయు పాండురంగ!
బుద్ధి స్థిరపడదు, శ్రద్ధ పెరుగబోదు
సహనమా పూజ్యంబు సర్వదేవ!
ఎట్లు సైచితో నాతోడు నింతవట్టు
విసిగి కడు డస్సి పోతివో విమలమూర్తి!
ఉద్ధరింపుమా యెట్లైన నూర్జితాంగ!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 61

సీ॥ నిద్దుర మత్తులో నీధ్యాన లేకయే
బాల్యంబు చకచకా పరుగుదీసె.
చీకు చింతలు లేని జీవన ప్రవంతిలా
కౌమార మెన్నడో కనుమరుగయె,
కామ్యార్థ సిద్ధికై కాలంబు వ్యర్థమై
యవ్వనం బేవీడి యరుగుచుండె,
మిడిమిడి జ్ఞానంబు మిణుమిట్లు గొల్పుచుఁ
పైదశ నెత్తినఁ బడక మునుపె,
దీపముండగ స్థితి చక్కదిదుకొనగ
భావి నూహించి మేల్కని భ్రాంతిపీడి,
సన్నుతింతు స్వగతమునఁ సద్గతులకుఁ
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 62

సీ॥ బ్రహ్మచర్యంబును పాటించు చున్నంత
కాంత నొకర్తుకఁ గట్టఁ బెట్టి,
పట్టుఁబట్టి ప్రగాఢ బంధనమ్ములఁ గూర్చి
బరువు బాధ్యతఁ బెంచి వంచినావు
సంసారమునఁ బడి సతమత మగుచుండ
హాయిగ నుందువే యాదవమురచిఁ
శాశ్వతంబుగ చిత్తశాంతికి దూరమ్ము
చేసి కర్మకు ముడివేసినావు
దుర్భరమ్ము నా స్థితి కడు దుస్సహంబు,
దారి చూపింప కుండుట ధర్మమగునె
దీనవత్సల! పద్మావతీవిలాస!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 63

సీ॥ అవసానమున యమయాతనలోఁబడి
తలతునో నోరార తలపలేనొ
తృప్తిమీరంగ నీ దివ్యమంగళమూర్తిఁ
జూతునో కనులారఁ జూడలేనొ
పరమ పావనమైన భవదీయ చరితంబు
విందునో చెవులార వీలుపడదొ
పరతత్త్వ చిహ్నాలౌ పద్మాంఘ్రి సంసేవ
పట్టునో యికమీద కల్గబోదొ
దొఱకునో నీ కడకొలువు దొఱకదేమొ
శక్తి యుడుగక మునుపె నా శక్తి కొలది,
ఇటుల కీర్తించి సేవింతు నేలుకొనుమ
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 64

సీ॥ ఇచ్చిన దానితోఁ దృప్తి వడితిఁ గాని
పరధనావళులఁ జేపట్టలేదు,
విశ్వంభరుఁడవని వేడుచుంటినిగాని
గొంతెమ్మ కోరికల్ గోరలేదు,
గ్రహపాటునకు లో వగచి యుంటినిగాని
వీసమైనను నిందవేయలేదు,
సాధుమార్గమువట్టి సాగుచుంటినిగాని
విసిగించి యాయాశ పెట్టలేదు,
పరహితార్థమునకుఁ బాటుపడుదుగాని
తెలివిఁదప్పి యేరికిఁ గీడు సలుపలేదు,
నేరమెంచక చేయూత నీయరాదె
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ!

సీ॥ చెల్లియో చెల్లకో చేసిన యపరాధ
శతములకే శిక్ష గతము నందు
కాలుని కడకొంత, గర్భ నరకమునఁ
బడిసుంత, యొక్కింత ప్రసవమందు
బాల్యాన రవ్వంత ఫలిత మనుభవించి,
తప్పు దారి వడక, యొప్పిదమగు
తి వెదకు కొనగ కరదీపికగ భగ
వద్గీత నూతగ పట్టుకొనుచు,
ధైర్యముంజిక్కవట్టి గతముఁ దలపక
సేవజేతు నీ కెడ్డు నన్జేరఁదీయ
రావె పరతత్త్వమూర్తి సర్వార్థ సిద్ధః
వేంకటాచలవాస శ్రీ వేంకటేశః 66

సీ॥ మాయావృతంబైన మహినిత్యమనియెడి
వెఱ్ఱిభ్రాంతింబడి వ్రేగిపోతి,
సంసారజలధియే స్వర్గమనితమకి
భోగలాలసుఁడనై పొంగిపోతి,
ఆలుబిడ్డలకై యహర్నిశల శ్రమించి
విధిచెయ్వులకు లొంగి విసిగి పోతి,
ప్రాపంచిక విషయ వాసనాతురుఁడనై
బుద్ధిమాంద్యంబున మురిసిపోతి,
కాలపాశపు క్రీనీడ కదలుచుండ
త్రుళ్ళిపడి మల్లడి కొనుచు కళ్ళుతెరచి,
కొల్చువాడను జూపవా క్రొత్తపథము
వేంకటాచలవాస! శ్రీవేంకటేశః 59

సీ॥ ఆట పాటల మున్గి హాయి యనుభవించి,
యర్థార్జనంబున నలసి సొలసి,
అర్థాంగికై తనువంకితం బొనరించి,
యలతి సౌఖ్యమ్ముల కలరి యలరి
వ్యర్థ వాదమొనర్చి బ్రతుకు వ్యయపరచి
వట్టిమాటలఁ బట్టి వదలకున్కి
ఇచ్ఛ వచ్చిన రీతి హెచ్చి పెచ్చు పెరిగి
తుచ్ఛ భోగాలపై నిచ్చఁజూపి,
ఆత్మతత్త్వ మర్మంబరయంగలేక
గగన కుసుమమై గమ్య మగమ్యమాయె
బ్రతుకుఁ జక్కదిద్దవు నా యభాగ్యమేమొ
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 68

సీ॥ కాలు నానతిగాని కన్నెఱ్ఱఁ జేయుచుఁ
మిత్తి నొక్కమ్ముడి మ్రింగునాడు,
శిథిల దేహమెడసి జీవు డెగయఁ జితిం
గట్టె బుగ్గయి మన్ను గలియునపుడు
ఆలు బిడ్డలు సఖులాత్మ బాంధవులింకఁ
దీరె ఋణమ్మని దిగులువడదు
రే కాని దాటి రారే పరిధి వదలి
ధన ధాన్య సంపత్తి దరికి రావు,
యశమొ దుర్యశమొ, యాత్మ నంటి యుండి
వీడ కుండ తరుము చుండు వెంబడించి,
ఇహ పరములందు సుఖ శాంతు లేవి మాకు?
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 69

సీ॥ కనుమూసి తెరచిన ననుపమ రూపమే
హృదిని స్ఫుటముగ ముద్రింపబడియె,
పిలచిన పలుకవు, యులుకవు పలికిన
రత్నాలు నీనోట రాలిపోవు.
నిర్దయవృత్తిఁ బూని సరకుసేయవ
దేలకో నా గోడు దీనబంధు,
వేడుకా పంతమా! వెతఁబెట్టఁజూతువా!
యరనిముషమ్మైన మరువజాలఁ
ఏల కల్గెనో యింతలో నీ పరాకు?
చిత్తగించవా నా మొఱ చిత్తమందుఁ
ఈవె కాదన్న నాకు దిక్కెవ్వరయ్య!
వేంకటాచలవాస! శ్రీ॥ 70

సీ॥ తొలి నెలవెద్దియో? తొలి రూపమెట్టిదో?
యెటనుండి వతుమో యెటఁజవెదమొ
ఎయ్యేది నిత్యమో? యేది యనిత్యమో
యీ పాడు మనుగడ యెన్నినాళ్ళొ?
ఈ మహాసృష్టికి నేది యాద్యంతమో?
ప్రాణులకీ యనుబంధ మేదొ?
ఎవరికెవ్వారో? యీ మమత్వం బేమియో?
వెన్నంటి ర దేది వీసమైన?
కడుకు; దేహాభిమానమ్ము నడుమయేల?
బ్రతికి నన్నాళ్ళు తహతహపడుట తప్ప
ఏమి ఫులుముకొంటి? ఇక నేది తెరవు?
వేంకటాచలవాస! శ్రీ॥ వేంకటేశ! 71

సీ॥ ఉడుగు లేషకలసి యనుబంధ మేర్పడి
కారణాంతరమునఁ గలసియుండు,
ఎట్టి వారలకైన నేడుమాటలతోడఁ
సాంగత్యముబ్బును క్షణమునందు,
పుత్ర వాత్సల్య ముప్పొంగి పొరలివచ్చు
కాంతకప్పుడె తొలికాన్పుతోడఁ
జ్ఞానకోశమువిచ్చి సంశయంబు లుడిగి
దురభిమానంబు విదూరమౌను
తనువునఁ బ్రాణమున్నంత దనుక బంధ
నాలడంగునా యేమైన వెడలింప
తరమె భగవదాజ్ఞ లేకున్న ధర్మరక్ష!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 72

సీ॥ ఎంతవారైన రవ్వంత చింతించిన
నెంత నీ చెంత యనంత! సుంత,
ఈ నగ్న సత్యమెఱిగి దాస దాసుఁడై
యహము వదలి నంత యలుముకున్న
అంధతిమిరతతి యణగి, శత సహస్ర
దళయుత హృదయ కమలము విచ్చి
నిర్వి కల్ప సమాధి నిత్య నిమగ్నుఁడై
యాత్మ సాక్షాత్కార మంది సతము
శాశ్వతానందలహరిని స్నానమాడి
ధన్యజీవియై మాన్యుడై తనరుచుండు,
ఆ మహద్భాగ్య మెన్నడు కూర్తువయ్య నాకు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 73

సీ॥ వర తపమూని కైవల్య మొందెదమన్న
దేహదార్ఢ్యంబె తిరోహితమయె.
సంప్రదాయముఁ బట్టి సాగి పోవుదమన్న
వైదికకర్మలే భ్రష్టమయ్యె,
మానవసేవలోఁ మనసు నిల్పెదమన్న
రాక్షసత్వము నడి రచ్చకెక్కె!
భవ్యరూపమునఁ విశ్వాసముంచెదమన్న
నాస్తిక ధూమమ్ము విస్తరించె
సాహసించి యెట్టినను సన్యసింత
మన్న కూడి రాదా యోగమైన, నా య
భీష్ట మేరీతి సిద్ధించు శిష్టభూష!
వేంకటాచలవాస శ్రీ వేంకటేశ! 74

సీ॥ ఏనాడు నీ నుండి యేరీతిఁ విడివడి
యెన్ని యధమ జన్మలెత్తినానొ,
అంత కంతకుఁ బహు యంతర మేర్పడఁ
దూరస్థుఁ డనగుచుఁ దూలినాను,
ఏ సుకృతమహిమ నీజన్మకలిగెనో
యెన్నెళ్ళు గడచి నవించుకైనఁ
బరమార్థ మెఱుగక పరిణతించక
మైహిక వాంఛల కమ్ముడువడి
వాగులన్ని కడలి వంక పరుగుదీయు
భంగి నా యాత్మ నీ యందు సంగమింపఁ
గ్రేళ్ళుఱకఁ దొడంగె క్రీడింపఁ గోరి
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 75

సీ॥ ఆ యశోదమ్మకు నఖిలములఁ ద్రుటిని
చూపితివట నోటఁ జోద్యపడగ
భీష్మాదులకుఁ నీదువిశ్వరూపంబు ద
ర్శించు భాగ్యము ప్రసాదించితివట,
కర్తవ్య విముఖుఁడౌ గాండీవిచేఁ బ్రీతిఁ
గీతామృతంబుఁ ద్రావించితివట
శరతల్పగతుఁడైన శాంతనవుని మెచ్చి
దివ్య విజ్ఞాన మందించితివట,
నీ దయారసంబెట్టిదో నీదు పుణ్య
గాథలం బట్టి కన్గొంటి గాని కనిక
రంబు జూపవు తలనేమి వ్రాసినావొ?
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 76

సీ॥ విధి కెదురీదైన విజయ మందగవచ్చు
దిక్యశక్తి సాధింపవచ్చు,
మృత్యుపాశపుగురి త్రిప్పి కొట్టగవచ్చు
ప్రళయాగ్నిఁ బుక్కిట పట్టవచ్చు,
సిద్ధాష్టకంబుల సిద్ధిఁ బొందగవచ్చు
యమరవరుల మ్రొక్కు లందవచ్చు,
కంఠహారముగ నాగంబు దాల్పగవచ్చు,
కాలకూటమ్మైనఁ గ్రోలవచ్చు,
గ్రహగతుల మార్చవచ్చు, గగనతలమున
నడుగిడగవచ్చు, భూతముల నడచవచ్చు
నిన్ను మెప్పింపఁ తరమౌనె యెన్నడైన
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 77

సీ॥ అంతరిక్షానఁ గ్రహములఁ జుక్కల నిల్పి
రీతిఁదప్పక కదలించ గలమె
ప్రాణంబు పోకడ పసిగట్టి జీవులఁ
జిరజీవులుగ సరిచేయగలమె,
ప్రకృతి శక్తుల తీవ్ర వైపరీత్యంబుల
నాహుతి కాకుండ నాపగలమె,
నిర్జీవ వస్తువునే యతి నేర్పునఁ
గోరిన ప్రాణిగ కూర్చగలమె
మనిషినే రాతిబండగ మార్చగలమె
జీవరాశిని తార్మారు చేయగలమె
పరమభక్తులకే సాధ్యపడును గాదె
వేంకటాచలనివాస! శ్రీవేంకటేశ! 78

సీ॥ విగ్రహారాధన బీజంబు భక్తికి
నాత్మనిగ్రహశక్తి కది పునాది
తార్కికమునకును తాత్త్వికచింతకుఁ
బ్రకృతియే యేకైక పాఠశాల
పరమ పావన గ్రంథపఠన శ్రవణము ల
జ్ఞాన విచ్ఛేదనా సాధనంబు,
గీతాప్రవచనంబు నూతన స్ఫూర్జిత
పరమపదమునకుఁ బట్టుకొమ్మ
సద్గురూపదేశంబు, సత్సంగసేవ,
వాంఛితార్థసిద్ధి కది దివ్యౌషధంబు
మూఢులకు వశ్యుఁడవగుట పూజ్యమయ్య!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 79

సీ॥ కుసుమాక్షతలుగ నీకుంభినిం బుట్టిన
పదపద్మముల చెంత వదలకుందు
పనుపు కుంపమమైన వల్మోటుతోనీదు సే
వకుం వినియోగింప బడుచునుందు,
కౌస్తుభమైతినా ఘనవక్షపీఠమం
దెల్ల వేళల నాశ్రయించి యుందు,
కస్తూరినైతినా కరమొప్పి ప్రీతిమై
వదనపటలమును బాయకుందు,
చంద నాగరు కర్పూర జలములయిన
అమల పంచాయుధాలైన నమరియుండు
భాగ్య మబ్బె దెప్పుడు కూడు భవ్యచరిత!
వేంకటాచలవాస శ్రీ వేంకటేశ! 80

సీ॥ ఈ కుసుమాక్షత లేనోము చెల్లించి
నీ పదసన్నిధి నిలువబడియె,
ఈ సరసీరుహంబే పూజగావించి
నీదు నాభీస్థలిం బాదుకొనియె,
ఈ పక్షిరాజేంద్రుండే దానమొనరించి
నీ వాహనంబుగ నెగడ దొడగె
ఈ వేంకటాచలుండే తపము సలిపి
నీ కటాక్షానం బునీతుండాయె
ఆహా! నీ వైభవంబు కర్ణామృతంబు,
నంత నీ చెంత నాకింత చోటు దొరకి
నంత చరితార్థుండనగదు నంతిమమున
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 81

సీ॥ నీ మహాసత్త్వంబునే వెల్లడించవే
గోచరాగోచర గోళ సృష్టి
నీ దయాసాంద్రతనే చాటిచెప్పదే
పరమపావనులైన భక్తకోటి,
నీ పూర్ణతత్త్వమునే కొనియాడవే
జీవనప్రదములౌ శ్రుతులతతులు,
నీ ధార్మికత్వంబునే ధ్రువపరచవే
దాల్చినట్టి దశావతారములును
ఎట్టి ఘనుడవో యిట్టులిప్పట్టు దెలిసి
ఎట్టులో బ్రొగ్గి నీ వంక హృదయ మింక
శీతకన్ను వేయక చెంత చేర్చరాదె
వేంకటాచలవాసః శ్రీవేంకటేశః 82

సీ॥ కోట్లాది సొమ్మును కూడబెట్టగ వచ్చు
శాస్త్రీయగ్రంథాలు చదువవచ్చు,
అసదృశశక్తిని వసుధనేలగవచ్చు
దేవళంబులఁ బ్రతిష్ఠఁ దీర్చవచ్చు
నీమమునఁ గ్రతువు నిర్వహింపగవచ్చు
కాలచక్రంబును కట్టవచ్చు
రాగమాలపించి బ్రతికింపగావచ్చు
తత్త్వదుగ్ధాబ్ధిని తరచవచ్చు,
ప్రకృతి శక్తులనె వికృతి పరచవచ్చు
మంత్రసిద్ధిని వ్యాధులఁ మాన్పవచ్చు
నీ కనుమరుగున మసలు టెవరి వశము?
వేంకటాచలవాసః శ్రీవేంకటేశః 83

సీ॥ ఎక్కడో దూరాన యేడవ కొండపై
వెంచేసి యున్నట్టి విష్ణుమూర్తి!
ఆరుల యార్తి విన్నంత నాత్రుత తోడఁ
సతత దుకొను ప్రశస్తహస్త!
మ్రొక్కుల మఱచినఁ బూర్తిగా హెచ్చుపై
కంబు గుంజెడి వడ్డికాసులదొర!
పగనైన, వగనైన, భయమునైన దలచు
వారి హితవు గోరు భక్తవరద
కొంగుబంగారమై నిల్చి కూర్మి నెరపు
భక్త చింతామణీ! కోటి భానుతేజ!
వినబడదేలనా మొఱ ప్రేమమూర్తి!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 84

సీ॥ అత్యంత భక్తిమై నాతిథ్యమిచ్చిన
శబరి యెంగిలిఁ దిని సంతసించి,
చారెడటుకులిడి సంతృప్తిఁ బరచిన
ప్రాణమిత్రుని బాధ లరసి వగచి,
తులలేని తులసిచేఁ దులయఁడుఁ దులఁదూగి
రుక్మిణి భక్తిని భూషిపరచి,
విభునిగ నెంచి సేవించిన గోపకాం
తల నెడ లమిత వాత్సల్య ముంచి,
మోక్షమిడి, భోగ భాగ్యాల ముంచి తేల్చి
భక్త సులభుఁడవై, ప్రేమభక్తి చాటు
సాధుసమ్మాన్య! వరదాయ! శరణు శరణు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 85

సీ॥ ఆశయే మృగతృష్ణ, యర్థ మనర్థంబు,
సర్వ సౌఖ్యంబు లశాశ్వతంబు
ఆత్మ స్థిరంబు దేహంబు క్షయకరంబు
యౌవనాధులు కడు నస్థిరంబు
వృద్ధాప్యము హరించు నింద్రియ బింకంబు,
సారహీనంబు సంసారఫలము,
రోగాష్టకంబు లరోగామయంబు.
దృశ్యమాన జగదృశ్యమౌను
విత్తినట్టి యీ వైరాగ్య బీజములకుఁ
నీరువోయుచు మొలకెత్తనిచ్చి దేహి
అక్షయంబౌ యలభ్యమౌ మోక్షభిక్ష
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 86

సీ॥ ఆశ్రితజనపోష! ఆశ్రయంబీయవా
యేడుగడవనుచు వేడికొనిన,
దీనజనోద్ధార! దిక్కుఁ జూపింపవా
నీ మూర్తిపైఁ దృష్టి నిల్పుకొనిన.
వాఙ్మనోగోచరా వాత్సల్యముంచవా
క్షేమతోనోరార బిలచుకొనిన,
తాపసమందార! సర్వనమీయవా
విభునిగా మదిని భావించుకొనిన
వశముఁ జేసికొనుటకైన భక్తి తప్ప
లంచమీయ నా యెడ యర్థంబు లేదు
సర్వలోకైక సంరక్ష! సాధుగాప!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 87

సీ॥ సంసార జలధిని సాగు నావికునకుఁ
జుక్కానివై దారి జూపువాఁడ!
మోహార్ణవంబునఁ మున్కలిడు జడుని,
తెప్పవై నొకప్రక్కఁ దేల్చువాఁ
విషమ పథంబునఁ వెడలెడి వారిని
దివ్యమార్గము వంకఁ ద్రిప్పువాడ!
అజ్ఞాన తిమిరాన నల్లాడు వారికిఁ
మెఱపువై సందేశ మిచ్చువాడ
ఆత్మ బాంధవా! విన్నప మవధరించి
మా నమస్ కిల్బిషములఁ మాడ్చి విడక
తోఁడు నీవవై బ్రోవుమా దుష్టదూర
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 88

సీ॥ తత్త్వంబు తలకెక్క తన బంధములఁ ద్రెంచి
కాషాయ వస్త్రంబు కట్టియున్న
నిటలపటలమున నీ చిహ్న రేఖలు
పూని లాంఛనముగ పులుముకొన్న
నియమానుసరణిగ నిరశన వ్రతమూని
చిత్తంబు శుష్కింపఁ జేసికొన్న
జపమాలఁ జేబూని జపమాచరించుచు
ముప్పొద్దులా నీకు మ్రొక్కుకొన్న
దృఢ మనస్కుఁడు కాకున్న దివ్యరూప
దర్శనాభాగ్య మింద సాధ్యమ్ము కాదు
ఆత్మ నిగ్రహంబీయవే యభయదాత!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ!

సీ॥ అమరత్వసిద్ధికై యమరుల వేడనా
వారు నీ కరుణకుఁ బాత్రులాయె
ఇంద్రత్వ సిద్ధికై యింద్రుని బొగడనా
దాసుఁడై నీ యాజ్ఞ తలనుదాల్చె
రుద్రత్వ సిద్ధికై రుద్రు నర్చింతునా
నీ పాద సేవకుఁ నిల్చియుండు,
బ్రహ్మత్వ సిద్ధికై పరమేష్టి గొల్తునా
ముప్వేళ వీడక పూజసేయు
అనఘ! విష్ణుత్వమునకు జేరాశపడినఁ
సాధ్య పడదని తేలినా సాహసించి
పట్టు విడక నీ చరణాలె పట్టుకొంటి
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 90

॥ పెద్దలపై జూపు వినయవిధేయతల్
నీ మీద నొకతూరి నిల్పి నంత
ఆలిపై ప్రకటిత మనురాగ మినుమంత
నీ మీద నొకమాదు నెట్టి నంత
సంతుపై నిల్పు వాత్సల్య మించుచుక
నీ మీద నొకసారి నిలిపి నంత
ఆప్తులపైఁ జూపు నాత్మీయతాముద్ర
నీ మీద నొకతేప నిలిపి నంత
భావమేదైన నిన్నె విగ్రహముంచి.
భాద భావంబు విడనాడి వేడినంత
కరతలామలకంబు మోక్షైకపదము
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 91

సీ॥ శ్రీరంగనీతులు చెప్పుట సరి కాదు
యాచరణ మూర్తిగ నలర వలయు,
వాల్గంటి కౌగిట పరవశించుట కాదు
పరమార్థ దృష్టితో బ్రతుక వలయు,
స్వార్థ లోభాలతో సంచరించుట కాదు
ధార్మికత్వమ్ము నం దనర వలయు,
విధి వక్రగతుండైన విలపించుటయె కాదు
దివ్య రత్నములఁ శోధించ వలయు,
పరమ హంసల చాడ్పునఁ ధరణి యందు
మంచి చెడ్డల గుర్తించి మసలునట్టి
వాని జన్మమే ధన్యంబు పట్టిచూడ
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 92

సీ॥ తలచిన కార్యంబు తప్పక శీఘ్రంబు
నెరవేరి నంతనే నింగికెత్తి
అతిసంబరంబున నందలమెక్కించి
యవకాశవాదులై యాదరింత్రు
తత్కార్యమే కాకతాళీయముగ మఱి
నెరవేరకున్న నిన్నే మరించి,
నేర మారోపించి నిర్లక్ష్యముగఁ జూచి
నాస్తికు లగుచు ననాదరింత్రు
వంచకు లధమచిత్తులు స్వార్థపరులు,
పరమ మూర్ఖులు భ్రష్టులు వారి నొక్క
కట కన్గొని నన్నుఁ గూడ కనికరించు
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 93

సీ॥ మాయమాటలఁ జెప్పి మత్తుగొల్పి యతివ
మాన మపహరించి మసలువారు,
మగని హతునిజేసి, మారు ప్రియునిగూడి
శీలంబు వెలకమ్మి చెడెడువారు,
కూటసాక్ష్యంబిడి కొండెములంజెప్పి
కొంపలన్నిటిఁ గూల్చి కులుకువారు,
సత్కర్మలఁ జెఱచి, చౌర్యమ్ము చేఁబట్టి
పొట్టగూటిని చెడఁగొట్టువారు
పడెడి నరకయాతన పగవారికైన
వలదు, నా కట్టి దుర్గతి పట్టకుండ
మంచిబుద్ధి కల్గించవా మారకుండ
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ 94

సీ॥ తల్లిగా కరుణించి, తండ్రిగా పోషించి,
గురువుగా దండించి దారిఁజూపి
అన్నగా మేల్గోరి, యక్కగా మన్నించి
నీడవై సర్వదా తోడు పడుచు,
పెద్దవై బోధించి, పిన్నవై ప్రేమించి,
సహధర్మచారివై సహకరించి
భర్తవై లాలించి, హర్తవై మదిదోచి,
హితుఁడవై కష్టాన హితువు గఱపి,
సమత నెఱపి, మమత జూపు సౌమ్యశీల
ఘన కుటుంబీకుండవని ప్రఖ్యాతి కెక్కు
నిన్ను నేనెల్లెఱుంగుదు నిత్యసత్య!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 95

సీ॥ శ్రీ దివ్యమంగళాకృతి నమ్మి సుస్థిర
చిత్తము తోడ నర్చించినంత
శ్రీరమ్యగాథ నాలించి సద్బుద్ధిఁ గీ
ర్తించి నీకే తనువర్పించినంత
శ్రీపుణ్య నామము స్వీకరించి జపించి
కోరి సేవకునిగ చేరినంత
శ్రీభవ్యచరణాల చిత్తాన హత్తించి
స్నేహంబు లెస్సగ చేసినంత
అన్య చింతావిదూరుఁడై యాశ్రయించి
కామరహితుఁడై కొల్చిన సేమమరసి
సార్థకమొనర్పవే జన్మ సచ్చరిత్ర!
వేంకటాచలవాస, శ్రీవేంకటేశ! 96

సీ॥ మనసులో నీరూపు మఱిమఱి పొడసూపి
కలిమాయ కే యెరగాకు మనుచు,
విషయచింతనమాని వెఱ్ఱిభ్రమపడక,
న్యాయ మార్గముఁ బట్టి నడువ మనుచు,
మత్తు నిద్దురవీడి మాయ తెరలఁజించి,
విహితకర్మంబుల వీడకనుచు,
ఉండెనో లేక లేకుండెనో యన్నట్టి
సందేహ మొందక సాగుమనుచు!
గతము తలచి వగవక సద్గతి గనుగొను
మనుచు తట్టి మేల్కొల్పంగ మత్తు వదలి
బంటునైతి నన్నేలుకో ప్రత్యగాత్మ!
వేంకటాచలవాస! (శ్రీ) వేంకటేశ! 97

సీ॥ లోకాలు కల్పించి లోకులఁ బుట్టించి
యల్లి బిల్లిగ బంధ మల్లినావు
సంసార వృక్షంబు చక్కఁగ నాటించి
వావివరుసల నేర్పరచినావు
పుట్టిగిట్టుట కర్మవిముక్తికిఁ బ్రత్యక్ష
సాక్ష్యంబు లేనని చాటినావు,
ఎటుఁజారిపోనీక గొట్టెటులో యరిష
డ్వర్గాలనే జతపరచినావు,
నీవె సర్వకార్యసన్నేత వగుచు,
కష్టసుఖజీవితంబు మాకంటఁగట్టి
మాయశక్తికి దాసుని చేయకయ్య
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 98

సీ॥ యాచకకోటికి నర్థమిచ్చుటె కాని
లేదుపోపొమ్మనలేవు నీవు.
తప్పటడుగిడిన దారిత్రిప్పుటె కాని
చచ్చినపామునే చంపబోవు,
పాదదాసులకుఁ గైవల్య మిచ్చుటెకాని,
ప్రతిఫలాపేక్షరహితుఁడవీవు
నేరస్థులకు శిక్ష నిర్ణయించుటెకాని
భిన్నభావంబు చూపించవీవు,
శరణు వేడిన యభయ మొసగుటెకాని,
విడచి పుచ్చుటెన్న డెఱుగ వీవు సుమ్మి
భవ్యగుణజాలధామ! అమేయప్రసిద్ధధామ!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 99

సీ॥ నిరతము వీడక నీ పాదమర్చించు
భాగ్యంబు కల్గించు వాసుదేవ!
సతము నీ భక్తాళి సాంగత్య విభవమ్ము
చేకూరనిమ్ము శ్రీ శ్రీనివాస!
అనిశము నాతోడి యన్యజీవుల మీద
దయ దయసేయుము ధర్మతేజ!
సత్యమ్ము మాలిమి కురిపించి నాకావ్య
కళకు జీవనమిమ్ము కమలనాభ!
ఏమి కావలె నా జన్మకింతకంటె
అస్థిరములైన భోగ భాగ్యంబులేల?
ముక్తి నిచ్చిన చాలదా భక్తతోష!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 100

సీ. ప్రాప్తముండినగాని వస్తువేదైనను
పట్టువడుట దుర్లభమని నుడివి,
దొరకిన నూతను తుదముట్టి యెట్లైన
వీడక నేరుగ వెంబడించి,
చనుటయే మేలని జ్ఞానసంపన్నులు
నొక్కి వక్కాణించి రొక్కమాడ్కి
ఈ జన్మమందైన నివ్విధంబుగ సంస్తు
తించిన జాలు తరించెదనను
వాంఛతోఁ గావ్యకన్య నర్పించినాఁడ
దీనిఁ గొని మనఃస్ఫూర్తిగఁ దృప్తిపడిన
జన్మ సాఫల్యమైనటు సంతసింతు
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 101

సీ॥ అంతరాళంబున నావరించిన గాఢ
మాయపొరలు మటుమాయమగుచు
పడుగు పేకలఁ గూడు వలువ పోగులెపసి
వాస్తవము గ్రహింపఁ భ్రాంతి తొలఁగి
దృశ్యమాన జగమదృశ్యమై నించుక
కుదుటపడని బుద్ధి కుదుటపడగ
పట్టిన గ్రహపీడ పట్టుసడలి యేదో
యవ్యక్త సందీప్తి యానహింపఁ
ఏమి యీవింత పులకింత? ఇంత దనుక
ఎన్న డనుభూతి నొందని యెన్నరాని
పట్టలేని యానందము పట్టువడియె
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ 102

సీ॥ గోకులాలంకార! గోవర్ధనోద్ధార!
బృందావనవిహార! వేదసార!
నందకిశోర! అనఘ దశాకార! జగ
న్మోహనాకార! ముముక్షుకాధార!
నవనీతచోర! సనాతనాకార! పీ
తాంబరధారి! లీలావతార!
దైత్యసంహార! సత్యం శివం సుందరా!
వకుళమాలాధర! పాపహార
దివ్య మురళీధరా! అంధ తిమిరాఘహారి!
సర్వతాపత్రయాహార! దశావతార!
రార! కనరార! పరమేశ్వరా! పురహార!
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 103

సీ॥ కన్నవారల కన్న మిన్నయై నను బెంచి
విద్య నేర్పించిన విమలమూర్తి
ఆశ్రయంబై నట్టి యుత్తరజ్ఞానంబు
బుద్ధి గఱపినట్టి పుణ్యమూర్తి
కావ్యకళకు జీవకళ దిద్ది నాయభ్యు
దయము పరంపర గోరు ధన్యమూర్తి
మా మాక సంక్షేమ మాశించి చేయూత
నందించి తోడ్పడు త్యాగమూర్తి
మహితమూర్తి మా తాతామహుఁ, మధుకరుండు,
పెద్దతండ్రి కానట్టి మా పెద్దతండ్రి,
ధర్మపత్న్యాత్ములయెడ కృతజ్ఞుఁడౌదు
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 104

సీ॥ ఆనాఁటి నాఁటోట నాశిక్షించిన యట్టి
నీ దివ్యలీలల నేఁడు దలఁచి,
భక్త్యాదరయుతుఁడనై పారవశ్యమ్మున
భాగ్యోదయాన సుప్రకాశించి
పట్టు సడలనీక పటుతరబుద్ధిని
సాధనమ్మునను యథాశక్తి సల్పి
నీ యనుగ్రహమునఁ జిన్నిపద్యములుగ సర్వ
హితంబు సంపూర్తి గావించినాను
రసికలోకమ్ము నాహ్లాదపఱచు నా రచన యుండు
లోపము లెంచక దయతో లోకమందు
కనికరమున మన్నించి కాపాడుమయ్య!
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 105

సీ॥ భవదీయ శతకంబు భక్తిమై పఠనశ్ర
వణములొనర్చిన వారికెపుడు
వాంఛసఫలమౌను, ప్రాణభీతి తొలగు,
సర్వకార్యజయము, శాంతికల్గు,
శోకభరముదీరు, శుభములు చేకూరు,
బాధలుపశమించు పాపముడుగు,
ఆయురారోగ్యభాగ్యయశముల్ ప్రాప్తించు
ధర్మపరాయణత్వంబు పెరుగు
సకల సౌభాగ్యములు లెస్సగ సంఘటిల్లు
వరమ పావనజీవన ప్రాప్తిదనరు,
భవదనుగ్రహసిద్ధి ధ్రువంబుగాదె
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 106

సీ॥ ఇందిరాసుందరా! ఇందీవరశ్యామ!
ఇనకులాంబుధిసోమ! ఈశమిత్ర!
ఖగవాహనారూఢ! గజరాజ పరిరక్ష!
జగదీశ! కేశవ! సర్వరక్ష!
దివ్య తేజోనిధీ! త్రిభువన సమ్మాన్య!
సత్కీర్తి విస్తార! సామ్యవాది!
ఆర్తజనావన! అగణిత గుణధామ!
భక్తవత్సల గుణోజ్జ్వల సమేత!
సుప్రసాద వదన బింబ! సౌందర్య గేహ!
పూర్ణరూప! కాలపురుష! మోహనాంగ!
నుతచరిత్ర! శతసహస్ర నతుల గొనుమ
వేంకటాచలవాస! శ్రీ వేంకటేశ! 107

సీ॥ శ్రీధరా! భూధరా! శ్రీతమనోహర! శిష్ట
జనమోదకారక! జ్ఞానదాత!
సురగణ సన్నుత! సుజ్ఞాన సంపన్న!
వర పర పురుష! హే వరద హస్త!
అమృతమయాకార! ఆనంద సంధాత!
వితరణ గుణనిధి! విమల హాస!
విశ్వాత్మ! చిన్మయా! విశ్వేశ! పరమాత్మ
సిద్ధ సంకల్ప విశిష్టదేవ!
స్వామి! కలియుగదైవమా సర్వదర్శి!
దేవ! పరమార్థ తత్త్వార్థ దీప్యమాన!
మహిత మహిమాన్వితా! నిత్య మంగళంబు
వేంకటాచలవాస! శ్రీవేంకటేశ! 108

ఇతి శ్రీమద్వేంకటేశ్వరా నూన కరుణాకటాక్షవీక్ష లబ్ధప్రసాద
భరిత కాస్యలేయస శ్రీమదరితస పవిత్ర గోత్రోద్భవ
తేజోమూర్తులాన్వయ రామయాహ్వాయ ప్రపౌత్ర
గవరాఖ్యపౌత్ర లక్ష్మీనరసమాంబా రామ
గోవిందార్య జ్యేష్ఠపుత్ర బుధజనవిధేయ
ఆనందకుమారీ కళత్ర సహిత
వేంకటేశ్వరరాయ ప్రణీతమైన
శ్రీ వేం క టే శ్వ ర సు ప్ర భా త శ త క మా ల
సం పూ ర్ణ ము
శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ
మంగళమహత్

# సవరణ

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 4 | 9 | అల | అఖిల |
| 6 | 12 | తిమ | తిరుమ |
| 7 | 17 | భకి | భక్తి |
| 8 | 7 | శంణా | శరణా |
| 13 | 13 | ఉత్పల్ల | ఉత్ఫుల్ల |
| 14 | 5 | త్రా మ్రో | తామ్రో |
| 21 | 17 | చిత | చిత్ర |
| 22 | 01 | ణాంబు | ణాంబ |
| 24 | 11 | నీకై | నీకె |
| 25 | 4 | తుఁడు | తుండు |
| 26 | 4 | యత్నించిని | యత్నించితిని |
| 27 | 16 | చితాన | చిత్తాన |
| 38 | 17 | జితికిని | జితికిన |
| 38 | 19 | దాటింపడు | దాటిపండు |
| 51 | 22 | తప్పు | తప్పొ |
| 55 | 11 | కీరి | కీర్తి |
| 54 | 21 | యశమొ | యశమో |
| 56 | 7 | తి | గతి |
| 58 | [illegible] | …తుమొ | వత్తుమొ |
| [illegible] | 19 | …గక | మెఱుగక |
| [illegible] | [illegible] | …సర్వ | యీసర్వ |
| [illegible] | 20 | …హర | పాపహరి |

49648

# రచయిత పరిచయము

కృతికర్త :- శ్రీ తేజోమూర్తుల వేంకటేశ్వరరావు
తండ్రి :- శ్రీ రామగోవిందము గారు
తల్లి :- శ్రీమతి లక్ష్మీనరసమ్మ గారు
శాఖ :- కోవలనాటి బ్రాహ్మణులు,
గోత్రము :- హరితస
జననము :- 24-7-1948
విద్య :- ఎం.ఏ. (తెలుగు) బి.ఇడి.
వృత్తి :- ప్రథమ శ్రేణి ఆంధ్రపండితులు
అభిరుచులు :- వృత్తి పట్ల గౌరవము, గ్రంథపఠనము, నాటకములయందు క్రీడలయందు, వాస్తు, జ్యోతిష ముహూర్తములందు కవితా వ్యాసంగములందు అభిరుచి ప్రవేశము।
ఇతరకృతులు:-
ముద్రితగ్రంథములు :- 1 శ్రీ సత్యదేవమహిమ 2 శ్రీ కుమా సుప్రభాతము 3 ఆంధ్రవ్యాకరణ చంద్రిక. 4 శ్రీ కనకదుర్గా సుప్రభాతము 5 శ్రీ వేంకటేశ్వర సుప్రభాతశతకమాల
అముద్రితగ్రంథములు : నాటకములు - నాటికలు శ్రీరామపట్టాభిషేకము సీతారామకళ్యాణము బ్రహ్మర్షి విశ్వామిత్ర ఆర్యచాణక్య రాణీరుద్రమదేవి సమ్రాట్ పృధ్వీరాజు ఏకలవ్య వెలుగుబాట, కనువిప్పు. శ్రీరామవనవాసము గురుదక్షిణ గౌరీ కళ్యాణము, దక్షయజ్ఞము, వాల్మీకి, శ్రావణభాద్రపదములు బూరెలమూకుడు ఘోషయాత్ర
పద్యకృతులు :- 1 శ్రీ కేదారనాథ మహిమ 2 శ్రీ గురుసంస్తవరాజము, శ్రీ కనకదుర్గాశతకము, సూక్తిమంజరి, శ్రీరాజగోపాలస్వామి సుప్రభాతము, శ్రీరాజగోపాలస్వామి శతకము,
వచనకవితాగ్రంథము : నేనూ - నా కవిత్వము
వచనగ్రంథములు :- శ్రీసత్యదేవ వైభవము,
ఏకపాత్రాభినయకుసుమావళి)